# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




వేదాంత దృక్పథంలో పాపమనేదే లేదు, పొరపాట్లు మాత్రమే ఉన్నాయి. మీరు పాపాత్ములని ఎందుకూ పనికి రారనీ వారిని అనడమే వేదాంతం దృష్టిలో పెద్ద పొరపాటు.

\- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 20 మంగళవారం 28 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## అమరావతి విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. వచ్చే నెల 28కి వాయిదా వేసింది. రాజధానిపై పిటిషన్లను తొందరగా విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. త్వరగా వాదనలు ముగించాలని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్పందించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఆ పిటిషన్లపై మార్చి 28న విచారణ చేపడతామని చెప్పింది. ఈ పిటిషన్లపై గత వారం విచారణ జరగాల్సింది. అయినా కూడా రాజ్యాంగ ధర్మాసనం బుధ, గురువారాల్లో మిస్‌లేనియస్ పిటిషన్లపై విచారణను నిలుపుదల చేసింది. అందుకే అప్పుడు వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అంశంపై రచ్చ కొనసాగుతూనే ఉంది. ప్రతిపక్షాలు

(మిగతా 2లో)

## శివమొగ్గ ఎయిర్ పోర్టు జాతికి అంకితం

**బెంగళూరు,**

కర్ణాటక పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ శివమొగ్గ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. రూ.450 కోట్లతో నిర్మించిన ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించారు. ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని కమలం పువ్వు ఆకారంలో నిర్మించారు. ప్రారంభించే ముందు విమానాశ్రయాన్ని పరిశీలించారు ప్రధాని. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు మోదీ. మల్నాడు ప్రాంతంలో కనెక్టివిటీని పెంచే విధంగా ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కార్యక్రమం పూర్తైన వెంటనే రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. శివమొగ్గ–షికారిపుర–రాణెబెన్నూర్ రైల్వే లైన్‌తో పాటు కొటెగంగూరు రైల్వే కోచింగ్ డిపోకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు మరో నాలుకు కీలక పథకాలనూ ప్రారంభించారు ప్రధాని నరేంద్ర మోదీ. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా 4.4 లక్షల మందికి లబ్ధి జరగనుంది. మల్టీ విలేజ్ స్కీమ్‌లను ప్రారంభించిన మోదీ రూ.950 కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్‌ను మొదలు పెట్టారు. శివమొగ్గలోనే రూ.895 కోట్ల విలువైన 44 స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు. ఇందులో భాగంగా 110



కిలోమీటర్ల పొడవైన 8 స్మార్ట్ రోడ్ ప్యాకేజ్‌లు అందిస్తారు. కంట్రోల్ సెంటర్, మల్టీ లెవల్ పార్కింగ్, స్మార్ట్ బస్ షెల్టర్ ప్రాజెక్ట్‌లు, సాలిడ్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్...తదితర ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు."శివమొగ్గ ఎయిర్‌పోర్ట్ చాలా అద్భుతంగా అందంగా ఉంది. టెక్నాలజీ మాత్రమే కాదు. కర్ణాటక సంస్కృతి ఉట్టిపడేలా నిర్మించారు. ఇది కేవలం ఎయిర్‌పోర్ట్ మాత్రమే కాదు. ఈ ప్రాంత యువత తమ కలలు సాకారం చేసుకునేందుకు దొరికిన గొప్ప అవకాశం. ఇవాళ యడియూరప్ప పుట్టినరోజు. ఆయన ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను. ఆయన తన జీవితాన్ని రైతులకు, ప్రజలకు అంకితం చేశారు. అసెంబ్లీలో ఆయన చేసిన చివరి ప్రసంగం ఎంతోమందిలో స్ఫూర్తి నింపింది."



## లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**నంద్యాల**

సోమవారం నుంచి అహోబిలం శ్రీ లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభంఅయ్యాయి. నరసింహ స్వామి భూమిపై అవతరించిన క్షేత్రమే అహోబిలం. నవనారసింహ క్షేత్రమని ప్రసిద్ధి పొందింది. దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద నారసింహుడు కొలువై ఉన్నాడు. ఆలయంలో విజయనగర రాజుల కాలంనాటి మూడు ప్రాకారాలు, ఎత్తయిన గోపురాలు, శిల్పకళా శోభతో అలరారే మండపాలు ఉన్నాయి. మూడో ప్రాకారాన్ని దాటి ఆలయంలోకి

(మిగతా 2లో)

## రేణిగుంటలో అగ్ని ప్రమాదం..

**తిరుపతి,:**



తిరుపతి జిల్లా రేణిగుంట ఫాక్స్ లింక్ ఎలక్ట్రిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. మంటల్లో ఉద్యోగులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దట్టమైన పొగతో మంటలు ఎగసిపడుతున్నాయి. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. రేణిగుంట పారిశ్రామిక వాడలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని మొదటి అంతస్థులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా మంటలు వ్యాప్తి చెందడంతో దట్టమైన పొగ భవనం మొత్తం విస్తరించింది. మంటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ఒక్కసారిగా పరిశ్రమ నుంచి ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. డేటా కేబుల్ తయారీ పరిశ్రమ కావడంతో మరింత వేగంగా మంటలు చెలరేగాయి. సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు అగ్నిమాపక వాహనాలతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు అగ్నిమాపక సిబ్బంది. మొదటి అంతస్థ పూర్తిగా దగ్ధం కాగా....మిగిలిన అంతస్థులన్నీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, వారిని రేణిగుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదంలో కోట్ల రూపాయల ఆస్తి దగ్ధం అయినట్లు యాజమాన్యం అంచనా వేస్తోంది. మేడ్చల్ జిల్లా కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ప్రశాంత్ నగర్ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నాలుగు స్క్రాప్ షాప్ తో పాటు 2 ప్లాస్టిక్ బాటిల్ మ్యానుఫ్యాక్చరింగ్ చేసే షెడ్లు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. వాటిలోని సామాగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఐదు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు అగ్నిమాపక సిబ్బంది. ఈ ప్రమాదంలో అశోక్ లేలాండ్ వాహనంతో పాటు మారుతి కారు కూడా దగ్ధమైనట్లు కూకట్ పల్లి పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలో ఆదివారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. చివ్వెంల మండలం గుంపుల శివారులో హైదరాబాద్– విజయవాడ జాతీయరహదారిపై రెండు బస్సులు మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన రెండు బస్సుల్లో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో రెండు బస్సులు పూర్తిగా కాలిపోయాయి. ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి విజయవాడ

(మిగతా 2లో)



## శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం అరుదైన రికార్డ్

**- నెల రోజుల్లో విజయవంతంగా రెండో గుండె మార్పిడి శస్త్ర చికిత్స**

**- గ్రీన్ చానల్ కూడా లేకుండా పక్కా ప్రణాళికతో చెన్నై నుంచి తిరుపతికి గుండె తరలింపు**

**- 13 నెలల పాపకు ప్రాణం పోసిన వైద్య బృందం**

**- డాక్టర్లను అభినందించిన టీటీడీ ఈవో ఎ వి ధర్మారెడ్డి**

**తిరుపతి,**

శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం ( చిన్న పిల్లల గుండె ఆసుపత్రి) వైద్యులు నెల రోజుల వ్యవధిలో రెండవ గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు సృష్టించారు. పక్కా ప్రణాళిక తో గ్రీన్ చానల్ కూడా లేకుండా చెన్నైలో బ్రెయిన్ డెడ్ అయిన రెండు సంవత్సరాల బాలుడి గుండెను సేకరించి తిరుపతికి తీసుకుని వచ్చి 13 నెలల పాపకు ప్రాణం పోశారు. ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన మీడియా

# ఎలా జీవించాలి ??

**ప్రజా తపన,**

మనిషి ఎలా బతకాలో చెప్పింది వేదం. చక్కగా చూస్తూ, చక్కగా వింటూ, మంచిగా మాట్లాడుతూ ఎవరికీ అధీనుడు కాకుండా ఉంటే మనిషి నూరేళు బతుకుతాడని వేదం చెబుతోంది.

ఎవరి ధనాన్నీ దొంగిలించకూడదు. అంటే, ధనార్జన ధర్మంగా ఉండాలి. అంతేకాదు– ద్వేషం లేని ప్రేమైక్క సమాజం మంచిదని వేదం బోధించింది.

ఉపనిషత్తులో ఓ మాట ఉంది. నిత్యం ఏదో ఓ మంచి విషయాన్ని వింటూ ఉండాలి. చదువుతూ ఉండాలి. చదివినదాన్ని మననం చేసుకుంటూ ఉండాలి.

ఎన్ని కష్టాలొచ్చినా సత్యాన్ని వదులుకోకూడదు. నైతికంగా పతనం కాకూడదు. నేను, నాది అన్న సంకుచిత భావనను వదిలిపెట్టాలి. చేసేవాడు, చేయించేవాడు ఆ భగవంతుడే అనుకుంటే– ఫలితాలమీద ఆపేక్ష ఉండదు.

'మా, మేము, నా' అనే స్వార్థానికి కౌరవులు జీవితంలో మొదటిస్థానం ఇచ్చారు. రెండో స్థానం ప్రపంచానికి, మూడో స్థానం భగవంతుడికిచ్చారు. ఫలితం అందరికీ తెలిసిందే.

పాండవులు తమ జీవితంలో మొదటి స్థానాన్ని భగవంతుడికి ఇచ్చారు. ద్వితీయ స్థానాన్ని నిస్వార్థ బుద్ధితో ప్రపంచానికిచ్చారు. తరవాత తమ గురించి ఆలోచించారు. అందుకే భారత యుద్ధంలో విజేతలయ్యారు.

ఎవరైనా జీవితంలో ప్రథమస్థానం భగవంతుడికి ఇవ్వాలి. స్వార్థాన్ని మరచి పరోపకారానికి పాటుపడి త్యాగాలు చేయాలి. ఆ పైనే తమ గురించి ఆలోచించాలి. అప్పుడే జీవితం సంతోషభరితం అవుతుంది.
ప్రతి మనిషీ ప్రపంచంలో ఒకడిగా తనదైన ముద్రవేయాలి తప్ప మందలో ఒకరిగా కలిసిపోకూడదు.


విలువలతో కూడిన జీవితం గడపడం, సక్రమమైన మార్గంలో ప్రయాణించడంవల్లే మనిషి లక్ష్యాలను చేరుకోగలుగుతాడు.

ఈ దేశంలో పుట్టిన సద్గురువులు ఎందరెందరో మానవసేవను మాధవసేవగా భావించారు. పరోపకారమే లక్ష్యంగా బతికారు. వినమ్రతతో దానధర్మాలు చేశారు. మనుషులు ఋషుల్లా మారారు. సంఘసేవకు నడుం బిగించారు. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ మహాత్ముడయ్యాడు.
కాలడి నుంచి హిమాచలం వరకూ కాలినడకన వెళ్ళి నిష్ఠగా ధర్మాన్ని ప్రబోధించిన శంకరాచార్యులు జగద్గురువయ్యారు. వారందరూ సంఘ శ్రేయం కోసం తమ జీవితాలు ధారపోసి చిరస్మరణీయులయ్యారు.

ఏ పనైనా కష్టపడితేనే పూర్తవుతుంది. కలలు కంటూ కూర్చుంటే అణువంతైనా ముందుకు సాగదు.

సింహం నోరు తెరుచుకుని ఉన్నంత మాత్రాన వన్యమృగం దాని నోటికి అందదు కదా! అసలు మన ఆలోచనలనుబట్టే ప్రపంచం ఉంటుంది. మన దృష్టి మంచిదైనప్పుడు లోకం మంచిగానే కనిపిస్తుంది. చెడుగా చూస్తే ప్రపంచం చెడ్డగానే కనిపిస్తుంది. ఇతరులకు మేలు చేయకపోయినా కీడు తలపెట్టకుండా ఉండటం మంచిది.

ప్రియంగా మాట్లాడితే శత్రువులైనా క్రమంగా మిత్రులవుతారు. సమాజశ్రేయానికి ప్రతి మనిషీ కృషిచేయాలి. నైతిక విలువలు పాటించి న్యాయమార్గంలో నడవాలి. ప్రేమను, జ్ఞానసంపదను అందరికీ పంచాలి. అప్పుడు మనిషి మనీషి అవుతాడు. అతడిలో భగవంతుడు కొలువై ఉంటాడు! అటువంటి ధన్యజీవులే ధరిత్రిని సంతోష ధామంగా, పుణ్యమూర్తులు నడయాడే ఆనందనందనంగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించగలుగుతారు.



# కన్నుల పండుగగా శివాజీ మహరాజ్ శోభాయాత్ర

**ప్రజా తపన,**

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మాజరాజ్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన శోభాయాత్రలో కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సుగురు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బెంగళూరు రోడ్డు మెయిన్ బజార్ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా మేళాపురం వరకు శోభయాత్ర కొనసాగించారు ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ శోభాయాత్రలో మహిళలు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను కన్నుల పండుగ కొనసాగించారు. జై శ్రీరామ్ జై శివాజీ అన్న నినాదాలతో పట్టణం మారుమోగింది కాషాయపు జెండాలతో హిందూపురం వీధులు నిండాయి ఈ సందర్భంగా బహిరంగ సభలో పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ భారతదేశంలో హిందూ అనే శబ్దంతో ఉన్న ఊరు హిందూపురం అని ఈ పట్టణంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అతిపెద్ద చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేయాలని చూస్తే ఎన్నికలు కూడా అమలులో ఉన్నందున అధికారులు నిరకరించారన్నారు ఎన్నికలకు కోడ్ రాజకీయ నాయకులు వారి విగ్రహాలకు ఉండాలి కానీ దేశం కోసం పోరాడిన శివాజీకి ఎందుకని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హిందూపురం పట్టణంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని చెప్పారు. అధికారులు సహకరించి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇస్తే ఒకలా ఏర్పాటు చేస్తామని నిరాకరిస్తే 5అడుగుకు 5 అడుగులు పెంచుకుంటూ వెళ్లి దేశంలోనే ఎక్కడా లేని విధంగా చత్రపతి శివాజీ విగ్రహాన్ని హిందూపురంలో ఏర్పాటు చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వ అధికారులు త్రివర్ణ పథకానికి ఏరకంగా విలువ ఇస్తారో అదే రకంగా కాషాయ ధ్వజానికి ఇచ్చే పరిస్థితి వస్తుందని అన్నారు మరియు ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సమస్త హిందూపురం హిందూ బంధువులందరికీ చత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు



# అమరావతి విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఏం మాట్లాడినా.. తాము మాత్రం మూడు రాజధానులకే కట్టుబడి ఉన్నామంటున్నారు. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ.. ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉంది. ఈ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. కీలక ప్రకటన చేశారు. ఢిల్లీలో జరిగిన ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు సన్నాహక సమావేశంలో ఏపీకి విశాఖపట్నం రాజధాని కాబోతోందని స్పష్టం చేశారు. తాను కూడా త్వరలోనే విశాఖకు షిఫ్ట్ అవుతానని వెల్లడించారు.మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై వైసీపీ నేత విజయసాయిరెడ్డి.. అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్.. లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2015లోనే దీన్నీ నోటిఫై చేశారని వివరించారు. 2020లో ఏపీ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లు తెచ్చిందని చెప్పారు. రాజధాని అంశంపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని కేంద్రం హోంశాఖ సహాయమంత్రి తెలిపారు. ప్రస్తుతం రాజధాని అమరావతి అంశం కోర్టు పరిధిలో ఉందని లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

# లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశిస్తూనే గొప్ప శిల్పచాతుర్యంతో 82 స్తంభాలతో నిర్మించిన రంగ మండపం దర్శనమిస్తుంది. ఆ తర్వాత అంతరాలయం, గర్భాలయాలు న్నాయి. ప్రధానాలయంలో శ్రీప్రహ్లాద వరద నరసింహ స్వామి కొలువుదీరి ఉన్నాడు. కుడి పాదాన్ని మడచి ఎడమ పాదాన్ని కిందకు వదలి సుఖాసీనుడై స్వామి దర్శనమిస్తాడు. వామాంకంపై శ్రీలక్ష్మి ఆశీనురాలై ఉంటుంది. శంఖు, చక్ర, అభయ, వరద ముద్రలను ధరించి నాలుగుచేతులా భక్తులను కటాక్షించే నృసింహుని దర్శనం ఆనందాన్ని కలిగిస్తుంది.

# శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం అరుదైన రికార్డ్

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి ఈ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 13 నెలల పాపకు గుండె తీవ్రంగా దెబ్బతినింది. తల్లిదండ్రులు ఆ పాప ను విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. పాపకు గుండె మార్చాల్సి ఉందని, తిరుపతి లో టీటీడీకి చెందిన శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రికి వెళ్ళాలని డాక్టర్లు సూచించారు. మూడు నెలల క్రితం తల్లిదండ్రులు ఆ పాపను ఆసుపత్రికి తీసుకుని వచ్చి అడ్మిట్ చేశారు. పాపకు సరిపోయే గుండె కోసం వైద్యులు జీవన్ దాన్ లో రిజిస్టర్ చేశారు. మందులతో పాప ఆరోగ్యం కాపాడుతూ వచ్చారు. చెన్నై లోని ఎంజిఎం ఆసుపత్రిలో రెండేళ్ళ బాబుకు బ్రెయిన్ డెడ్ అయ్యిందని, గుండె దానం చేస్తారనే విషయం ఆదివారం శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డికి తెలిసింది. ఎపి జీవన్ దాన్ సంస్థ, చిన్నపిల్లల గుండె చికిత్సల నిపుణులు డాక్టర్ గణపతి బృందాన్ని ఆయన సమన్వయం చేసుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మాచర్ల లోని పాప తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో రాత్రి 10 గంటలకు వారు ఆసుపత్రికి చేరుకున్నారు. రాత్రి 10–30 గంటలకు పాపకు అవసరమైన పరీక్షలు, కోవిడ్ పరీక్ష కూడా చేసి గుండె మార్పిడి చేయొచ్చని నిర్ధారించుకున్నారు. టీటీడీ సహకారంతో అంబులెన్స్, మరో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని వైద్య బృందం రాత్రికే చెన్నై చేరుకుంది. గ్రీన్ చానల్ అవసరం లేకుండా 2గంటల 15 నిముషాల్లో గుండెను తిరుపతి ఆసుపత్రికి తీసుకుని వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. నిముషం కూడా ఆలస్యం చేయకుండా తెల్లవారుజామున 3 గంటలకు గుండె ను తిరుపతి ఆసుపత్రికి తెచ్చారు. 45 నిముషాల్లో మెడికల్ ప్రొసీజర్స్ పూర్తి చేసి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గణపతి నేతృత్వంలోని వైద్య బృందం ఉదయం 4–30 గంటలకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స ప్రారంభించి ఉదయం 9–30 గంటలకు విజయవంతంగా పూర్తి చేసింది. రూ 30 లక్షల ఖర్చయ్యే ఈ శస్త్ర చికిత్స టీటీడీ ప్రాణదానం, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శ్రీ పథకాల కింద పూర్తి ఉచితంగా చేశామని ఈవో తెలిపారు. మరో మూడు నాలుగు రోజులు పాపను ఐసీయూలో ఉంచి తరువాత వార్డుకు మారుస్తారని ధర్మారెడ్డి చెప్పారు. గుండె మార్పిడి శస్త్ర చికిత్సలకు అనుమతి లభించిన నెలరోజుల్లోనే రెండు గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందం దేశంలోనే రికార్డు సృష్టించిందని ఈవో అభినందించారు. నెలరోజుల క్రితం గుండె మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం కె ఎస్ ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన 15 సంవత్సరాల విశ్వేశ్వర్ సోమవారం డిశ్చార్జ్ అవుతున్నారని ఈవో తెలిపారు. పాప పూర్తి ఆరోగ్యవంతురాలై త్వరగా డిశ్చార్జ్ కావాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని అందరూ ప్రార్థించాలని కోరారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రారంభించిన 15 నెలల్లోనే 1150 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తో పాటు బంగ్లాదేశ్ నుంచి కూడా వచ్చిన పిల్లలకు గుండె ఆపరేషన్లు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ లేదా ప్రధానమంత్రి ఆరోగ్య భీమా కార్డు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వివరించారు. ఇలాంటి ఆసుపత్రి రాష్ట్రంలో శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రి మాత్రమేనని ఆయన తెలిపారు. జేఈవో శ్రీమతి సదా భార్గవి, బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్ గణపతి, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు. జార్ఖండ్ బాబుకు శస్త్ర చికిత్స జార్ఖండ్ రాజధాని రాంచి నివాసి శ్రీమతి లుక్సార్ పర్వీన్ మూడు నెలల కుమారుడికి వైద్య బృందం విజయవంతంగా గుండె శస్త్ర చికిత్స నిర్వహించింది. వేలూరు లోని సి ఎం సి ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్ళిన పర్వీన్ కు అక్కడి వైద్యులు తిరుపతి లోని శ్రీపద్మావతి చిన్న పిల్లల గుండె చికిత్సల ఆసుపత్రి కి వెళ్ళాలని సిఫారసు చేశారు. తన బాబును తిరుపతికి తీసుకుని వచ్చి అడ్మిట్ చేయడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించి 15 రోజుల క్రితం శస్త్ర చికిత్స చేశారు. బాబు ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాడని పర్వీన్ సంతోషం వ్యక్తం చేశారు. తన బాబు ప్రాణాలు కాపాడిన టీటీడీ కి, వైద్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# రేణిగుంటలో అగ్ని ప్రమాదం..

(మొదటిపేజీ తరువాయి)

వెళ్తోన్న వెన్నెల బస్సులో సాంకేతికలోపంతో మంటలు చెలరేగాయి. బ్యాటరీలో సమస్యతో బస్సు లైట్లు ఆగిపోయాయి. అయితే ప్రయాణికులను వేరే బస్సుల్లో వారి గమ్యస్థానాలకు పంపించారు. సూర్యాపేట నుంచి ఏపీఎస్ఆర్టీసీకి చెందిన మరో బస్సును తీసుకొచ్చి.. వైర్ల సాయంతో రెండు బస్సుల మధ్య బ్యాటరీ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. సూర్యాపేట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా పెద్ద శబ్ధం వచ్చింది. అనంతరం మంటలు చెలరేగాయి. ఆ మంటలు మరో బస్సుకు కూడా వ్యాపించారు. ప్రమాద సమయంలో బస్సుల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మేజిక్ రాజాకు దక్కిన అరుదైన గౌరవం

**పెద్దపల్లి :**

గోదావరిఖనికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, పలుకళలలో ప్రవీణుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్లో గత ఆదివారం జరిగిన 'సింహపురి మాయేంద్రజాల్' మేజిక్ ఫెస్టివల్ లో రాజాను నిర్వాహకులు, అతిధులు పండితుడి తరహా తలపాగా ధరింపజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. ఫెస్టివల్ గురించి, ప్రముఖ మెజీషియన్ల ప్రదర్శనల గురించి టౌన్ హాల్ ముందు, పట్టణంలోని వలచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలలో కార్యక్రమానికి వ్యాఖ్యాతగా తన పేరును ప్రత్యేకంగా ముద్రించారు. ఉదయం నుండి రాత్రి వరకు జరిగిన ఇంద్రజాల పోటీలు, గాలా షోలు, సన్మాన–సత్కారాలకు ఆద్యంతం వ్యాఖ్యాతగా వ్యవహరించి రాజా కార్యక్రమాన్ని రక్తి కట్టించగా, రాజా ప్రతిభను, ఆయన ఇంద్రజాల రంగానికి చేస్తున్న సేవను అతిథులు ప్రశంసిస్తూ మేజిక్ ఫెస్టివల్ విజయవంతం కావాలంటే రాజా పాత్ర కీలకమని, మేజిక్ రాజా వ్యాఖ్యానంలేని ఇంద్రజాల ఉత్సవాలను ఊహించలేమన్నారు. స్థానిక డిఎస్పి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు టైగర్ మహ్మద్, ఏకే రాయల్ తోపాటు సీనియర్ ఇంద్రజాలికులు సివి.రమణ, స్టిక్ మనోహర్, బోస్, అలీ, ప్రదీప్ రంగ్రేజ్, తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల నుండి సుమారు మూడు వందల మంది మెజీషియన్లు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న వ్యాయామం

**కర్నూలు:**

రెండు రోజుల కిందట హైదరాబాద్ లో ఓ కానిస్టేబుల్ వ్యాయామం చేస్తూ కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవక ముందే ఏపీలో అలాంటి ఘటనే జరిగింది. ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ వ్యాయామం చేసేందుకు జిమ్ కు వెళ్లాడు. వర్కౌట్స్ చేస్తున్న సమయంలో అక్కడ కళ్లు తిరిగినట్లు అనిపించగా కొంత సమయానికే జిమ్ నుంచి బయటకు వచ్చేశాడు. అలా రాగానే ఆయనకు మూర్ఛ వచ్చింది. విషయం గుర్తించిన స్థానికులు సపర్యలు చేయగా.. స్పృహలోకి వచ్చాడు. ఈ క్రమంలో కార్డియాక్ అరెస్ట్ అయి కాసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన 28 ఏళ్ల యువకుడు హైదరాబాద్ లోని ఓ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేస్తున్నారు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం విధానంలో ఇంటి వద్దే ఉంటున్నారు. అతనికి ఇటీవల వివాహం కూడా నిశ్చయం అయింది. వ్యాయామం చేయడానికి శనివారం ఉదయం పట్టణంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రధాన రహదారిపై ఉన్న జిమ్ కు ఆయన వెళ్లారు. వర్కౌట్స్ చేస్తుండగా కొద్దిసేపటికే కళ్లు తిరగడంతో స్నేహితుడితో కలిసి బయటకు వచ్చారు. స్నేహితుడు వాటర్ బాటిల్ తేవడానికి వెళ్లగా అంతలోనే యువకుడికి మూర్ఛ వచ్చింది. విషయం గుర్తించిన స్థానికులు సపర్యలు చేశారు. అయితే కాసేపటికి మెలకువ వచ్చినా కొంత సేపటికే మళ్లీ కుప్పకూలిపోయాడు. అక్కడికి చేరుకున్న స్నేహితుడు వెంటనే ఆటోలో ఆదోని ప్రాంతీయ ఆస్పత్రికి యువకుడిని తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు యువకుడు గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. యువకుడి పేరు వెల్లడించేందుకు బాధిత కుటుంబీకులు నిరాకరించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ లో కార్డియాక్ అరెస్ట్ కు గురైన ఓ వ్యక్తి ప్రాణాన్ని ట్రాఫిక్ కానిస్టేబుల్ కాపాడారు. రెండు రోజుల కిందట నడి రోడ్డుపైనే ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికాగా, ట్రాఫిక్ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు దక్కడంలో కీలక పాత్ర పోషించాడు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి బస్సు దిగిన బాలాజీ అనే వ్యక్తికి గుండెపోటు వచ్చింది. ఎల్బీ నగర్ నుంచి బాలాజీ అనే వ్యక్తి ఆరంఘర్ వైపు ప్రయాణిస్తున్నాడు. ఆరంఘర్ చౌరస్తాలో దిగగానే బాలాజీ గుండెపోటుతో కుప్పకూలాడు. అతణ్ని గమనించి ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్ వెంటనే సీపీఆర్ చేశారు. ఛాతీపై గట్టిగా పదే పదే ప్రెస్ చేసి బాలాజీ ప్రాణాన్ని రాజశేఖర్ కాపాడారు. అనంతరం బాలాజీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇటీవల ఒక్కరోజే హైదరాబాద్ నాలుగు కార్డియాక్ అరెస్ట్ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఫిబ్రవరి 23న పాత బస్తీలో ఓ పెళ్లి వేడుకలో వరుడిని రెడీ చేస్తుండగా ఓ వ్యక్తి కుప్పకూలిపోయాడు. కాలాపత్తార్‌లో మహమ్మద్ రబ్బాని అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఇటీవల తమ బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యాడు. ఈ కార్యక్రమంలో బంధువులంతా ఉత్సాహంగా పాల్గొని వరుడిని ముస్తాబు చేస్తున్నారు. ఇంతలో మహమ్మద్ రబ్బాని పెళ్లి కొడుకు వద్దకు వచ్చి.. అతడి పాదాలకు పసుపు రాస్తుండగా ఉన్నట్టుండి కూర్చున్న చోటే కుప్పకూలిపోయాడు. వెంటనే గమనించిన బంధువులు ఆయన్ని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మరణించినట్లు ధ్రువీకరించారు. రబ్బాని మరణంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మహమ్మద్ రబ్బాని వరుడి పాదాలకు పసుపు రాస్తూ కుప్పకూలిన దృశ్యాలను బంధువులు ఫోన్‌లో వీడియో తీశారు.

# గులాబీ గూటికి తాడి శకుంతల

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలో బీఆర్‌ఎస్‌లోకి భారీ చేరికలు ఉంటాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ చెప్పారు. దేశ గతిని మార్చే సత్తా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ కే ఉన్నాయని అన్నారు. విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల, మహిళా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వేఘవరపు వరలక్ష్మి, ఓబీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రితో పాటు పలువురు మైనార్టీ నాయకులు బీఆర్ఎ లో చేరారు. పార్టీలో చేరిన వారికి తోట చంద్రశేఖర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ నుంచి వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు, సమాజంలో పలుకుబడి ఉన్నవాళ్లు ఎంతో మంది బీఆర్ఎస్ లోకి చేరేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. దేశం గుణాత్మక మార్పు చెందాలని, ఉజ్వల భారతం కోసం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ అద్భుత రోడ్ మ్యాప్ ను రూపొందించారని చెప్పారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి అతిస్వల్ప కాలంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో దేశానికి రోల్ మాడల్ గా తీర్చిదిద్దారని తెలిపారు. అదే స్ఫూర్తితో ఏపీతోపాటు అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పొత్తుల కోసం పవన్ కల్యాణ్‌కు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రూ.వెయ్యి కోట్ల ఆఫర్ ఇచ్చారన్న ప్రచారాన్ని తోట చంద్ర శేఖర్ ఖండించారు. ఇలా ప్రచారం చేస్తున్న వారి దిగజారుడుతనానికి అద్దం పడుతుందని.. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పొత్తులు ఏ పార్టీతో అయినా పెట్టుకోవచ్చని అన్నారు. పొత్తు మేము పెట్టుకుంటే సంసారం ఇతరులు పెట్టుకుంటే వ్యభిచారం అన్నట్టు మాట్లాడడం సరికాదని అన్నారు. పొత్తు కోసం కేసీఆర్ డబ్బు ఆఫర్ చేశారని అభియోగాలు చేయడం వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసినట్టు అవుతుందని దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాలకుల నిర్లక్ష్యం వల్ల గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. దేశంలో రైతాంగ సమస్యలను ఏ ఒక్క పార్టీ పట్టించుకోలేదని అన్నారు. ఏపీకి రాజధాని లేకపోవడం ప్రజల దురదృష్టమని బి అర్ ఎస్ పార్టీ అన్నీ రాష్ట్రాలలో విస్తరిస్తుందని అన్నారు. ముఖ్యమైన రైతాంగ సమస్యల పై బిఆర్ఎస్ దృష్టి పెడుతుందని అన్నారు. నిరుద్యోగం, ధరల నియంత్రణ లేకపోవడం ప్రధానంగా ఉన్నా సమస్యలని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి విభజన హామీలను సాధించుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధనలో వైసిపి, టిడిపి పార్టీలు విఫలం అయ్యాయిని అన్నారు. పెద్ద పార్టీల లీడర్ల ను అవహేళన చేసే అభియోగాలు మోపడం తగదని అన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే విషయంపై పవన్ కల్యాణ్‌ను కొంత మంది బీఆర్ఎస్ ప్రతినిధులు కలిసి ప్రాథమికంగా చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేస్తే ఎలాంటి పరిస్థితులు ఉంటాయి.. ఏపీ రాజకీయాలు ఎన్నికల తర్వాత ఎలా మారతాయి. బీఆర్ఎస్ , పవన్ కల్యాణ్ కలిస్తే ఎలాంటి రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి అన్నవాటిపై లోతైన పరిశీలనతో... బీఆర్ఎస్ ప్రతినిధులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించినట్లుగా చెబుతున్నారు. అయితే ఇది మొత్తం బీఆర్ఎస్ వైపు నుంచి ఏపక్షంగా జరుగుతోంది కానీ పవన్ కల్యాణ్ ఇంత వరకూ ఎలాంటి ఆసక్తి చూపించలేదని చెబుతున్నారు.

# కన్నా బాటలో కమలం నేతలు

**గుంటూరు:**

ఎన్నికలు సమీపించే కొద్దీ రాజకీయం వేడెక్కుతుంది. అది సహజమే. రాజకీయ పార్టీలలో గెలుపు గుర్రాల వేట మొదలవుతుంది. అదీ సహజమే. రాజకీయ నాయకుల్లో టికెట్ల ఆరాటం ఆరంభమవుతుంది. రాజకీయాల్లో సిద్ధాంతాలు కనుమరుగైపోయిన నేపథ్యంలో అటు పార్టీలు, ఇటు నాయకులు కూడా గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతారు. అది కూడా సహజమే. కానీ ఏపీలో ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నరకు పైగానే గడువు ఉంది. కానీ అప్పుడే పార్టీల్లో.. నాయకుల్లో ఎన్నికల హడావుడి పెరిగిపోయింది. గెలుపు గుర్రాల వేట కూడా ఆరంభమైపోయింది. ఇటు పార్టీలు అటు నాయకులు ఎన్నికల మూడ్ లోకి వెళ్లి పోయారు. ఓ వంక వడపోతలు మరోవంక గోడ దూకుడులు అప్పుడే జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలు అభ్యర్ధుల ఎంపిక కసరత్తు ప్రారంభించడంతో పోటీకి సిద్ధమవుతున్ననేతలు, ఆశావహులు, స్థానిక సమీకరణాలు, పార్టీల బలాబలాలు, గెలుపు అవకాశాలు బేరీజు వేసుకుని, ఉన్న పార్టీలో ఉండడమా, గోడ దూకడమా అన్న లెక్కల్లో బిజీ అయిపోయారు. మాజీ మంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కమలం పార్టీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరడంతో.. ఇప్పుడు రాజకీయ వర్గాల్లో నెక్ట్స్ ఎవరు? అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా బీజేపీ నుంచి బయటపడేది ఎవరన్న చర్చ స్పీడప్ అయ్యింది. నిజానికి కన్నా వెంట ఆయన అనుచరులు చాలా పెద్ద సంఖ్యలోనే తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. కేవలం అనుచరులు మాత్రమే కాదు, సహచరులు కూడా అందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం సాగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో జరిగిన 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు చాలా మంది ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ కు భవిష్యత్ లేదనే నిర్ణయానికి వచ్చారో ఏమో కానీ, ఇతర పార్టీల లోకి సర్దుకున్నారు. ఇప్పుడు బీజేపీ విషయంలోనూ బీజేపీ నాయకులు అదే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. నిజానికి అప్పట్లో టీడీపీ వైసీపీలలో చేరిన మాజీ కాంగ్రెస్ నాయకులు ఏదో విధమైన రాజకీయ ఫలాలను ఎంతో కొంత మేర అందుకున్నారు. కొందరు టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలలో మంత్రులయ్యారు. మరి కొందరు ఇతర అధికార పదవులు అందుకున్నారు. రాజకీయంగా నిలదొక్కుకున్నారు. కానీ కమలం గూటికి చేరిన కీలక నేతలు ఎవరికీ కూడా ఎలాంటి పదవులూ దక్కలేదు. రాష్ట్రంలో ఆ అవకాశమే లేదు. కేంద్రంలో అవకాశం ఉన్నా బీజేపీ నాయకత్వం బయటి వారిని బయటనే ఉంచేసింది. బీజేపీలోని మాజీ కాంగ్రెస్ నాయకులు ఏదో ఆశించిన బీజేపీలో చేరిన ఇతర పార్టీల నాయకులు తీవ్రమైన ఉక్క పోతకు గురి అవుతున్నారు. ఇప్పుడు అలాంటి వారంతా, కన్నా .. బాటలో కొత్త దారులు వెతుక్కుంటున్నారు. టీడీపీలో చేరిన వెంటనే పని ప్రారంభించిన కన్నా లక్ష్మీనారాయణ చాలా మంది మాజీ మిత్రులు, బీజేపీ నాయకులు తనతో టచ్ లో ఉన్నారని చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. కన్నా ఎవరి పేర్లూ చెప్పక పోయినా కొందరు బీజేపీ సీనియర్లు తనతో టచ్‌లో ఉన్నారన్నారని.. వారంతా త్వరలోనే భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటారని.. ఇప్పటికే అనుచరులతో మాట్లాడుతున్నారని.. అన్నీ త్వరలోనే బయటకు వస్తాయని అన్నారు. అయితే, కన్నా తనతో టచ్ లో ఉన్నవారిలో, దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఉన్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. అయితే, నిజానికి కన్నా టీడీపీలో చేరతారనే ప్రచారానికి ముందు నుంచే, టీడీపీలో చేరే వారిలో పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తూ వచ్చింది. సుదీర్ఘ కాలం తరువాత ఇటీవల దగ్గుబాటి వెంకటేశ్వర రావు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో సమావేశమైనప్పటి నుంచి, ఈ ప్రచారం జరుగుతూనే వుంది. అయితే పురందేశ్వరి ప్రస్తుతం తనతో పాటు టీడీపీలో చేరడం లేదని చెప్పిన కన్నా, ఆమె భవిష్యత్తులో ఎలాంటి నిర్ణయం అయినా తీసుకునే అవకాశం ఉందని అన్నారు, అంటే ఆమె కూడా తెలుగు దేశం పార్టీలో చేరే ఆలోచనలో ఉన్నారని అనుకోవచ్చుననే సంకేతం కన్నాలక్ష్మీనారాయణ ఇచ్చారు. పురందేశ్వరి విషయం ఎలా ఉన్నా కన్నా... మాజీ కాంగ్రెస్, బీజేపీ మిత్రులకు టీడీపీ ఎంట్రీకి రోడ్డు మ్యాప్ క్లియర్ చేసినట్లేనని, ఇప్పటికిప్పుడు కాకపోయినా, ముందుముందు టీడీపీలోకి వలసలు జోరందుకుంటాయని అందరూ అంగీకరిస్తున్నారు. అందుకే ముందు ముందు ఏపీ రాజకీయాల్లో పెను మార్పులు తథ్యమని అంటున్నారు.

# విశాఖలోనే జగన్ శుభకృత్ వేడుకలు

**విశాఖపట్టణం :**

వచ్చే నెలలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో ఇప్పుడు ఏపీ ఫోకస్ అంతా విశాఖపైనే ఉంది. దీని తర్వాత ఉగాది నుంచి విశాఖనే ఏపీకి రాజధాని కాబోతుందా? విశాఖలో సీఎం ఉండేందుకు నివాస భవనం సిద్ధమైందా? సీఎం ఒకవేళ విశాఖకు వస్తే అమరావతిలో అడుగుపెట్టరా? లేదంటే కొన్ని రోజులు విశాఖలో, మరికొన్ని రోజులు అమరావతిలో ఉంటారా? సీఎం జగన్.. విశాఖకు రావడం ఖాయం అట. అయితే ఆయన వారానికి 2 రోజులు మాత్రమే విశాఖలో ఉండబోతున్నారట. సోమవారం ఉదయం వచ్చి సోమ, మంగళవారాలు విశాఖలో బస చేయనున్నారట. ఈ రెండు రోజులు విశాఖ నుంచే పరిపాలన ఉండబోతుందనేది అధికారుల నుంచి వస్తున్న అనధికార సమాచారం. అధికారులతో సమీక్షలు, అధికారిక సమావేశాలు ఇక్కడ నుంచే జరగబోతున్నాయట. రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో గ్రామ పర్యటనకు వెళ్లాలని సీఎం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతీ బుధవారం ఎంపిక చేసిన గ్రామానికి వెళ్లి రాత్రికి అక్కడే పల్లె నిద్ర చేస్తారట. మళ్లీ ఉదయాన్నే అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించి గురువారం అక్కడ నుంచి అమరావతి వెళ్తారట. శుక్ర, శని, ఆదివారాలు సీఎం జగన్ అమరావతిలో ఉండబోతున్నారు. శుక్రవారం అధికారిక సమావేశాల అనంతరం అవసరమైతే వీకెండ్‌లో అక్కడ నుంచే జిల్లాల పర్యటన చేస్తారట, విశాఖలో రాజధానికి సంబంధించి పూర్తి క్లారిటీ వచ్చి, అవసరమైన భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు షెడ్యూల్ ఇలా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. రిషికొండలో నిర్మితం అవుతున్న అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీస్ పూర్తయ్యే వరకు విశాఖలో హార్బర్ పార్క్ పేరుతో ఉన్న విశాఖ పోర్ట్ గెస్ట్ హౌజ్‌లో సీఎం జగన్ బస చేయబోతున్నారట. సువిశాలమైన వాతావరణంలో ఏర్పాటు చేసి ఉన్న ఈ గెస్ట్ హౌజ్‌లో ఒక వీఐపీ సూట్‌తో పాటు కొన్ని మిని సూట్లు, వీఐపి రూమ్స్ ఉన్నాయి. చుట్టూ పచ్చదనం నిండి ఉండి అవసరమైన పార్కింగ్ స్పేస్ కూడా ఉంటుంది. భద్రత పరంగాను ఇది వ్యూహాత్మకమైన ప్రాంతం అన్నది అధికారుల అంచనా. పోర్ట్ భద్రతను పర్యవేక్షించే అమోఈ బలగాల పర్యవేక్షణలో ఈ గెస్ట్ హౌజ్ ఉంటుంది. కేవలం కిలోమీటర్ దూరంలో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి, 15 కిలోమీటర్ల దూరంలో ఎయిర్ పోర్ట్ ఉంటుంది. అన్ని విధాల అనువైన ప్రాంతంగా దీన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఉగాది తర్వాత విశాఖ నుంచే పరిపాలన అన్న దానిపై అధికార వర్గాలు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినా దీనిపై విస్తృతంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

# విస్తరణ దిశగా బీఆర్ ఎస్


**హైదరాబాద్ :**



మహారాష్ట్రలోని నాందేడ్ లో కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహించిన సమయంలో బీఆర్ఎస్ లోకి చేరికలు జరిగాయి. తాజాగా బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా మాణిక్ కదమ్ నియమితులయ్యారు. మహారాష్ట్రలో పార్టీ విస్తరణపై దృష్టిసారించిన కేసీఆర్ ఆ రాష్ట్ర బీఆర్ఎస్ కిసాన్ సెల్ బాధ్యతలను మాణిక్ కదమ్ కు అప్పగించారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదంతో కేసీఆర్ దేశ వ్యాప్తంగా నినదిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు సైతం రాష్ట్రాల్లో రైతుల కోసం తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా వివరాలను బీఆర్ఎస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో కిసాన్ సెల్ అధ్యక్షుడిగా జాతీయ రైతు సంఘం నేత గుర్నాంసింగ్ చడూనీని నియమించడం తెలిసిందే. తాజాగా రైతు మాణిక్ కదమ్ కు మహారాష్ట్ర బీఆర్ఎస్ విభాగం అధ్యక్షుడిగా కేసీఆర్ నియమించారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అక్కడ అధికారంలోకి వస్తే రైతులకు రైతు బంధు ఇస్తాను, 24 గంటలు విద్యుత్ అన్నదాతలకు అని ఇటీవల నాందేడ్ లో జరిగిన బీఆర్ఎస్ సభలోనూ కేసీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ తనను బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్ సెల్ విభాగం అధ్యక్షుడిగా నియమించడంపై మాణిక్ కదమ్ హర్షం వ్యక్తం చేశారు. సాధారణ రైతునైన తనకు పార్టీ కిసాన్ విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో రైతులకు అండగా నిలబడేందుకు, అన్నదాతల కన్నీళ్లు తుడిచేందుకు కేసీఆర్, బీఆర్ఎస్ శ్రమిస్తున్నాయని మాణిక్ కదమ్ అన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని, సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ తో కలిసి దిగిన ఓ ఫొటోను ఫేస్ బుక్ లో పోస్ట్ చేశారు. ఇన్నేళ్లయినా చాలా గ్రామాల్లో తాగునీరు, సాగు నీరు లేదన్నారు. కరెంట్ సదుపాయం లేకుండా వందల గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయని నాందేడ్ లో బీఆర్ఎస్ సభలో కేసీఆర్ అన్నారు. వనరులు ఉన్నా ప్రభుత్వాల చేతకాని పరిస్థితుల వల్లే ఇది జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని సీఎం కేసీఆర్ అన్నారు. దేశంలో విప్లవాత్మక మార్పు అవసరం ఉందని కేసీఆర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. ఇన్నేళ్లయినా చాలా గ్రామాల్లో తాగునీరు, సాగు లేదన్నారు. కరెంట్ సదుపాయం లేకుండా వందల గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయన్నారు. దేశంలో నాయకత్వ మార్పు రావాలని ఆయన ఆకాంక్షించారు. మహారాష్ట్రలో అత్యధిక ఆత్మహత్యలు జరుగుతున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు.

# సిసోడియా... తర్వాత ఎవరు...

**న్యూఢిల్లీ :**



ముందు నుంచీ అనుకున్నట్లుగానే లిక్కర్ స్కాంలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అరెస్టయ్యారు. సీబీఐ ఆదివారం ఆయనను విచారించి ఆ తరువాత అరెస్టు చేసింది. ఉదయం నుంచి ఎనిమిది గంటల పాటు ప్రశ్నించిన సీబీఐ అధికారులు అనంతరం అరెస్ట్ చేసినట్లుగా ప్రకటించారు. ఇక్కడ తప్పని సరిగా ప్రస్తావించాల్సిన అవసరమేమిటంటే.. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీష్ సిసోడియాను అరెస్టు చేస్తారని ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గతంలోనే ప్రకటించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు మోడీ సర్కార్ ను వ్యతిరేకించే పార్టీలూ, నాయకుల లక్ష్యంగానే పని చేస్తున్నాయన్నది ఆయన ఆరోపణల సారాంశం. ఈ ఆరోపణను కేవలం ఆప్ మాత్రమే చేయడంలేదు. బీజేపీయేతర పార్టీలన్నీ చేస్తున్నాయి. మొత్తంగా కేంద్ర దర్యాప్తు సంస్థల తీరు వాటి ప్రతిష్టకు వన్నె తెచ్చేదిగా ఎంత మాత్రం లేదని సామాన్య జనం కూడా అభిప్రాయపడే విధంగా ఉందన్నది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. అదలా ఉంచితే ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీష్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేయడంతో ఇక తరువాతి వంతు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితేనా అన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో సౌత్ గ్రూప్ కు చెందిన కవిత, రామచంద్ర పిళ్లై మినహా మిగిలిన వారంతా అరెస్టయ్యారు. దీంతో తదుపరి అరెస్ట్ కవితనే కావొచ్చని అంటున్నారు. ఇప్పటికే కవితను సీబీఐ ఒక సారి విచారించింది. మరో సారి విచారణకు నోటీసులు జారీ చేసినా.. విచారణకు ఎప్పుడు హాజరు కావాలన్నది స్పష్టం చేయలేదు. ఇప్పుడు మనీష్ సిసోడియా అరెస్టుతో రోజుల వ్యవధిలోనే కవితనూ విచారించే అవకాశం ఉందని అంటున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## వరంగల్ తూర్పు లో కాంగ్రెస్ ఖాళీ

**వరంగల్**

తూర్పు నియోజకవర్గం లోని 41 వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ మైనారిటీ నాయకుడు నసీర్ బిఆర్ఎస్ లో చేరిక. -కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే నరేందర్.కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే నరేందర్ గారు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షతులై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నసీర్ మరియు వారి మిత్ర బృందం పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కేసీఆర్ గారి నాయకత్వంలో కేటీఆర్ గారి మార్గ నిర్దేశనంలో తూర్పు నియోజకవర్గాన్నీ 3800 కోట్లతో అభివృద్ధి చేసుకుంటున్నామని వాడ వాడన సీసీ రోడ్లు,1100 కోట్లతో మల్టీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్,75 కోట్లతో బస్ స్టేషన్, కలెక్టరేట్ తో పాటు మరెన్నో అభివృద్ధి పనులతో నియోజకవర్గాన్ని ముందుంచామన్నారు. గతంలో ఉన్న నాయకులు పోలీస్ స్టేషన్ పంచాయతీలు తప్ప నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఎం లేదని ఎమ్మెల్యే అన్నారు కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ కుటుంబంలో చేరిన నసీర్ మరియు వారి బృందానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ నసీర్ ను వారి బృందానికి ఎల్లవేళలా తోడుగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు

## సిపిఐ నిరసన

**విశాఖపట్నం**

భూకబ్జాదారుల నుండి కల్లు గీత కార్మికులను కాపాడాలని సిపిఐ పార్టీ నిరసన వ్యక్తం చేసింది . విశాఖ నగరంలోని జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం జరిగింది. విశాఖలోని పాత మధురవాడ సర్వే నెం 274/1 లో కల్లు గీత కార్మిక కుటుంబాలుకు చెందిన భూమిని దొంగ రిజిస్ట్రేషన్ తో కొట్టేయ్యడానికి ప్రయత్నాలు చేస్తున్న కబ్జా దారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాదారులకు మద్దతు పలుకుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పైడ్రాజు, విమల తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీవి ఆరాచకాలు

**సూర్యాపేట**

కేంద్ర ప్రభుత్వనీపై రాష్ట్ర మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. బిజెపి దుర్మార్గాలకు పరాకాష్ట ఆప్ నేత సిసోడియా అరెస్ట్ కావడమని అన్నారు. ఈ.డీ, ఐ.టీ, సిబిఐ వంటి సంస్థలు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయాయి. బిజెపి నేతలు చేసిన ఆరోపణల కోసం మాత్రమే కేంద్ర నిఘా సంస్థలు పనిచేస్తున్నాయి. ఎమర్జెన్సీకి మించిన దారుణమైన పరిస్థితులు దేశంలో కొనసాగుతున్నాయని ఆరోపించారు. బిజెపేతర రాష్ట్ర ప్రభుత్వాలపై.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు అప్రజాస్వామికం.బిజెపి అరాచకాలు ఇలానే కొనసాగితే దేశ ప్రజల నుండి తిరుగుబాటు తప్పదు. అణచివేతల ద్వారా చరిత్రలో ఏ ప్రభుత్వాలు మనుగడ సాధించలేదు. బిజెపి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.

## జగన్మోహిని అలంకారంలో నరసింహుడు

**యాదాద్రి భువనగిరి**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి....వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఉదయం జగన్మోహిని అలంకార సేవలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు నరసింహుడు...ఆలయ మాడవీధుల్లో నయన మనోహరంగా స్వామివారు జగన్మోహిని అలంకార సేవలో ఊరేగుతూ భక్తులను పరవజీంపచేశారు...లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు...వజ్ర వైఢూర్యాల ధరించిన స్వామివారు ఆలయ తిరువీధులో ఊరేగుతూ దగదగ మెరిసిపోయారు.వేద మంత్రలు,వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు..

## ప్రీతి కేసు సిట్టింగ్ విచారణతో జరిపించాలి

**హైదరాబాద్,:**

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఆమె నిన్న రాత్రి ప్రీతి మరణించింది. ఆమె స్వగ్రామంలో నేడు ప్రీతి అంత్యక్రియలు జరుగుతున్నాయి. అయితే.. ప్రీతి మృతిపై విద్యార్థి సంఘాలతో పాటు రాజకీయ నేతలు స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. సైఫ్ వేధింపులపై తండ్రి ఫిర్యాదు చేయగానే విచారణ జరిపితే సమస్య వచ్చేది కాదన్నారు. హెచ్ఓడీ ఇద్దరిని పిలిచి కౌన్సిలింగ్ చేయడం ఏంటని ఆయన అన్నారు. సైఫ్‌ని హెచ్చరిస్తే సమస్య తీవ్రత తగ్గేదని, నిందితుడితో పాటుగా.. పోలీస్ అధికారి.. కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఓడీని కూడా సహనిందితుడిగా చేర్చాలన్నారు జీవన్ రెడ్డి. సిట్ విచారణ.. సీట్టింగ్ జడ్జితో జరపాలన్నారు. రక్షిత అనే అమ్మాయి కూడా వేధింపులతో చనిపోయిందని, భూపాలపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.జరుగుతున్న ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మూడు నెల్లలోనే విచారణ పూర్తి చేసి.. శిక్ష వేస్తేనే న్యాయమని ఆయన అన్నారు.

# సంక్షేమం.. సామాజిక న్యాయం

**విజయవాడ :**

వైఎస్ జగన్ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తున్నారు. ఎంతమంది కలసి వచ్చినా ఒంటరిగా పోటీ చేసి మరోసారి అధికార పీఠాన్ని అధిరోహించాలన్న యత్నంలో ఉన్నారు. అందుకు అనుగుణంగానే ఆయన ప్రయత్నాలన్నీ ఉన్నాయి. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరో వైపు పదవుల పంపకాన్ని కూడా చేపట్టారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలకు వైసీపీలో వచ్చిన పదవులు మరే ప్రభుత్వంలో రాలేదనే చెప్పాలి. అందుకే వైసీపీలో కొనసాగితే.. జగన్ దృష్టిలో పడితే ఎప్పటికైనా పదవులు వస్తాయన్న నమ్మకాన్ని నేతల్లో కలిగించడంలో జగన్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ఎన్నడూ చట్టసభల్లోకి అడుగుపెట్టని కులాల వారిని కూడా వెతికి మరీ జగన్ పదవులు ఇవ్వడం పార్టీలో చర్చనీయాంశమైంది. జగన్ నిర్ణయం కొందరికి ఇబ్బందిగా ఉండవచ్చు. తమకు పదవులు దక్కలేదని అనుకోవచ్చు. అలాగే విపక్షాలు కూడా పవర్ లేని పదవులు ఎందుకు అని విమర్శలు చేయవచ్చు. అలంకార ప్రాయంగానే ఓట్ల కోసం పదవులు ఇస్తున్నారని ప్రతిపక్షాలు సూటిపోటీ మాటలు అనొచ్చు. కానీ ఫైనల్ గా ఇప్పటి వరకూ వినని కులాల పేర్లు కూడా జగన్ బయటకు తీసుకు వచ్చారు. వారికి చట్ట సభల్లో స్థానం కల్పిస్తున్నారు. శాసనమండలిలో అడుగుపెట్టడం సామాన్య విషయమేమీ కాదు. ఒకప్పుడు ఎమ్మెల్సీ అవ్వాలంటే ఎన్నో అర్హతలుండేవి. కులాలతో పాటు ఆర్థికంగా కూడా స్థిరపడి ఉంటేనే వారికి పెద్దల సభలో చోటు దక్కుతుంది. ఏ పార్టీలోనైనా ఇంతే. కానీ జగన్ వచ్చాక పూర్తిగా ఛేంజ్ చేశారనే చెప్పాలి. తాము జీవితంలో ఎమ్మెల్సీ అవుతామని ఊహకు కూడా నోచుకోని వారు పదవులు అందుకుంటున్నారు. పార్టీని నమ్ముకుని ఉంటే జగన్ ఎప్పటికైనా తమకు మంచి పదవులు ఇస్తారన్న నమ్మకం కార్యకర్తల్లో కలుగుతుంది. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు.. వీళ్లుకాదు ఇప్పుడు శాసనమండలికి వస్తోంది. అంతా కొత్త వారే. రాజకీయంగా ఏమాత్రం పలుకుబడి లేని వాళ్లే. అలాంటి వారికి పదవులు సులువుగా జగన్ ఇచ్చారంటే తమకు ఎందుకు రావన్న ధీమా మిగిలిన నేతల్లో పెరిగే అవకాశముంది. గంపగుత్తగా వచ్చే ఎన్నికల్లో ఆ సామాజికవర్గం ఓట్లు వైసీపీకి పడతాయో? లేదో? చెప్పలేం గాని సింహభాగం ఓటర్లను మాత్రం జగన్ ఆకట్టుకోగలిగారనడంలో ఎలాంటి సందేహం లేదు.ఈ ధీమాయే వచ్చే ఎన్నికల్లో వారిని పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు పని చేస్తుందని జగన్ వేసుకుంటున్న లెక్కలు వర్క్ అవుట్ అవుతాయనే అనుకుంటున్నారు.ఎన్నడూ ఎవరూ తమ సామాజికవర్గాన్ని ఇంతవరకూ గుర్తించలేదని, జగన్ మత్రమే తమను ఏరికోరి ఎంపిక చేయడం పట్ల ఆ సామాజికవర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. సంతృప్తి చెందుతున్నాయి. ఒక వ్యక్తికి పదవి ఇచ్చినంత మాత్రాన సామాజికవర్గమంతా బాగుపడకపోయినా, ఆ కులం సమస్యలు పరిష్కారానికి సులువైన మార్గం ఆ ఒక్క వ్యక్తి ద్వారానే దొరుకుతుందనడంలో అతిశయోక్తి లేదు. జగన్ కు మొన్నటి వరకూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలే అండగా ఉండేవి. ఇప్పుడు బీసీ వర్గాలు కూడా తోడయ్యాయని వైసీపీ నేతలు సంబరపడి పోతున్నారు. మరి చివరకు ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా అధికారంలోకి వచ్చే ఏ ప్రభుత్వమైనా ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాల్సిందే. ఆ మేరకు జగన్ బలహీనవర్గాలకు ఒక మంచి పని చేశారనే చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదు.

## ఆ 3 వేల ఎకరాలు మావే...హుకూం జారీ చేసిన టీటీడీ

**తిరుమల:**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) మరో వివాదాన్ని తెరపైకి తెచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు వేల ఎకరాలకుపైగా భూములన్నీ మావే. వీటిని రిజిస్ట్రేషన్ చేయొద్దు' అంటూ గతేడాది ఫిబ్రవరిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. ఇందుకు సంబంధించి సుమారు 200 సర్వే నంబర్లను సమర్పించింది. ఈ లేఖపై దేవాదాయ శాఖ స్పందిస్తూ ఈ భూములన్నీ 22ఎ కింద ఉన్నాయని, వీటి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖకు నివేదించింది. దీంతో, ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ ఈ నెల తొమ్మిదిన ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల నిషేధం విధించిన వాటిలో సర్వే నంబర్ 11/2బి-2 అక్కారంపల్లిలోని 1200 ఎకరాలు, సర్వే నంబర్ 1, 2, 3, 4లో లీలామహల్ నుంచి బిటిఆర్ నగర్, శెట్టిపల్లి, మంగళం క్వార్టర్స్, కరకంబాడి వరకూ 700 ఎకరాలు, తిరుపతి బ్లిస్ స్టార్ హోటల్ నుంచి లక్ష్మీపురం జంక్షన్, పద్మావతిపురం వరకూ మరో 300 ఎకరాలు, నాగలాపురం, అప్పలాయగుంట, నారాయణవనంలోని రైతులకు సంబంధించి 250 ఎకరాలు ఉన్నాయి. నారాయణవనానికి చెందిన టిటిడి కల్యాణ మండపం సర్వే నంబర్ 83/12ఎ /2బి/4ఎలో మూడు ఎకరాల్లో ఉంది. అయితే సర్వే నంబర్‌లోని 30 ఎకరాల రిజిస్ట్రేషన్‌పైనా నిషేధం విధించింది. ఈ మూడు వేల ఎకరాల్లో 1100 ఎకరాలు సాగు భూములు ఉన్నాయి. వీటిని రైతులు ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 1900 ఎకరాల్లో ఇళ్లు, షాపులు, కొన్ని అపార్టుమెంట్లు ఉన్నాయి. పేదలు, ప్రయివేట్ వ్యక్తులు వీటిని నిర్మించుకున్నారు. ఈ వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా, ఎటువంటి విచారణా జరపకుండా రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ గుడ్డిగా ఈ ఆదేశాలు ఇచ్చిందని స్థానికులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు వారు సన్నద్ధం అవుతున్నారు. నిషేధం విషయమై తిరుపతి జిల్లాకు సంబంధించిన ఓ రిజిస్ట్రేషన్ అధికారిని సంప్రదించగా టిటిడి ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రకటించారు తప్ప, సబ్‌డివిజన్ చేసి ఉంటే గందరగోళం ఉండేది కాదన్నారు. 26 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సమస్య తలనొప్పిగా మారిందని, తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వమే గెజిటెడ్ నోటిఫికేషన్ ఇచ్చి సబ్‌డివిజన్ చేసి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ ఈ సమస్య ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు.టిటిడి గతంలో కూడా ఇటువంటి వివాదాలకు తెరలేపింది. 'తిరుపతి అంతా టిటిడితే' అంటూ 2002లో అప్పటి ప్రభుత్వం 781 జిఒను జారీ చేసింది. టిటిడి విజ్ఞప్తి మేరకు ఈ జిఒ ఇచ్చింది. అప్పట్లో ఇది పెద్ద వివాదాస్పదమైంది. '781 వ్యతిరేక జిఒ పోరాట కమిటీ'గా స్థానికులు ఏర్పడి మూడు నెలల పాటు ఆందోళనలు చేయడంతో అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గి ఈ జిఒను ఉపసంహరించుకుంది.

# తెలంగాణలో యాక్టివ్ అవుతున్న సైకిల్

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కిట్లను చంద్రబాబు పంపిణీ చేశారు. హైదరాబాద్ లోని తెలంగాణ తెలుగు దేశం కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతిఒక్కరూ టీడీపీని గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. యువత, మహిళలకు టీడీపీ మాత్రమే పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. 41 ఏళ్లుగా తెలుగువారి కోసమే పనిచేస్తున్న పార్టీ టీడీపీ అని అన్నారు. తెలంగాణ గడ్డపైనే ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని ప్రకటించారని, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకే టీడీపీని స్థాపించారని అన్నారు. సమష్టిగా కృషిచేసి టి.టీడీపీకి పూర్వవైభవం తేవాలి. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందే టీడీపీ. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌ను ఐటీలో అగ్రగామిగా తీర్చిదిద్దిన ఘనత టీడీపీదే. దేశంలో ఎక్కడాలేని విధంగా హైదరాబాద్‌లో మౌళిక వసతులు సైబరాబాద్‌ను నిర్మించిన ఘనత టీడీపీదే. కాసాని జ్ఞానేశ్వర్ నేతృత్వంలో పార్టీ బలోపేతం" అవుతోందని చంద్రబాబు అన్నారు."సంపద సృష్టించడం, ఉపాధి కల్పించడం, అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యం. సంపద సృష్టించడం ఎంత ముఖ్యమో, పేదలకు అందించడం అంతే ముఖ్యం. చరిత్ర ఉన్నంత వరకూ టీడీపీ ఉంటుంది. టీడీపీ ఎక్కడ ఉంది అనేవారికి ఖమ్మం సభే సమాధానం. ఇక్కడికి వచ్చి చూస్తే టీడీపీ ఎక్కడ ఉందో కనిపిస్తోంది. తెలుగువారు ఎక్కడున్నా వారికోసం టీడీపీ పని చేస్తుంది. కాసాని నేతృత్వంలో తెలంగాణ టీడీపీ పరుగులు పెడుతోంది. తెలంగాణలో మొదటి సీటు నాయి బ్రాహ్మణులకు, రెండో సీటు రజకులకు ఇస్తాం. తెలంగాణ తెలుగు దేశం పార్టీకి యువత అండగా నిలబడాలి. విభజన తర్వాత లేనిపోని సమస్యలు పెట్టుకోవటం సరికాదు. తెలంగాణలో సంపద సృష్టించడానికి కారణం టీడీపీనే. పేదలను నాయకులుగా ప్రమోట్ చేసిన పార్టీ టీడీపీ మాత్రమే. ప్రజల్లో ఉన్న నాయకులను మాత్రమే పార్టీ గౌరవిస్తోంది. ఎన్టీఆర్ భవన్ చుట్టూ కాకుండా కింది స్థాయి నేతలు గ్రామాల్లో తిరిగితే టీడీపీని కాపాడుకోవడం సులభం అవుతుంది" అవసరం ఉందని చంద్రబాబు మాట్లాడారు .గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం విజయవంతం చేయాలని కాసాని పిలుపు ఇచ్చారు. ఆదివారం "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఎన్టీఆర్ భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన తెలుగుదేశం నినాదం మారుమోగేలా చేస్తామని చెప్పారు. టీడీపీకి పూర్వవైభవం తీసుకురావటానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ నేతలంతా నెలరోజుల పాటు గ్రామాలు, బస్తీల్లోనే ఉండాలని అన్నారు. ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా సరే టీడీపీని బలోపేతం చేస్తామని, టీడీపీలో చేరికకు పలువురు ఇతర పార్టీల నేతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## టీడీపీ సమీక్షా సమావేశం

**అనకాపల్లి**

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు,నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమిక్షా సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ముమ్మిడివరం మాజీ శాసనసభ్యులు,అనకాపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలికులు ధాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యావంతులు, టీడీపి అభ్యర్థి డా వేపాడ చిరంజీవి రావు మాస్టారు ని మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. 2024ఎన్నికల్లో గెలవడానికి ఎమ్మెల్సీ ఎన్నికలే సెమీ ఫైనల్స్ అనీ అన్నారు.ఈ సంధర్భంగా ఆయనను పీల గోవింద సత్యనారాయణ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,అభిమానులు, మహిళా నాయకులు, తెలుగు యువత సభ్యులు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## మున్సిపాల్ స్పందన కు మూడు అర్జీలు




**నంద్యాల**

వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఆర్ ఓ వర ప్రసాద్ అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. వివిధ అంశాలపై మూడు అర్జీలు అందాయని ఆర్ ఓ వర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ కొనుగోళ్లపై సమావేశం

**కాకినాడ**

కాకినాడ మాధవ నగర్ లో గల కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ కమ్యూనిటీ హాల్ లో కాకినాడ మొబైల్ ఫోన్ సర్వీస్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ క్రైమ్ డిఎస్పి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ రసీదులు ,తదితర సరైన పత్రాలు లేని సెల్ ఫోన్లు ను వ్యాపారస్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు.సెల్ ఫోన్ ప్రతిఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారిందన్నారు . సెల్ ఫోన్ రిపేరర్లు, పాతవాటిని కొనే ముందు తగిన ధ్రువపత్రాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు . అదేవిధంగా వివిధ కేసుల్లో దొంగిలించిన ఫోన్లు సెకండ్ సేల్ కు వస్తాయని, ఇవి పలు వివాదాలకు కారణమవుతాయని, సరైన పత్రాలు లేని ఫోన్లు అమ్మకానికి వచ్చినప్పుడు ఎటువంటి అనుమానాలు వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డి.ఆర్.కె, అధ్యక్షులు సాయి ప్రసాద్ లు మాట్లాడుతూ హోల్ సేల్ వ్యాపారులు కూడా మొబైల్స్ రిపేర్ చేయడం సరిగాదన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి శిక్షణ పొంది, మొబైల్ రిపేరింగ్ నేర్చుకున్నామన్నారు. హోల్ సేల్ వ్యాపారులు కూడా మొబైల్ రిపేరింగ్ చేయడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఎస్సై లు టీవీ మూర్తి, క్రాంతి కుమార్, అసోసియేషన్ సెక్రటరీ గణేష్, ఉపాధ్యక్షులు రమేష్, సెక్రటరీ కిరణ్, సభ్యులు నరేష్ , ప్రకాష్, రమేష్ ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

**గూడూరు**

తిరుపతి జిల్లా గూడూరు పట్టణం సాయిబాబా గుడి సమీపంలో సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తిరుపతి జిల్లా దక్కిలి మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన 27 సంవత్సరాల వయస్సు కలిగిన వివాహిత రాజేశ్వరి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది . మృతురాలి భర్త బంగారయ్య సమాచారం మేరకు కందల వారి పల్లి గ్రామానికి చెందిన బంగారయ్య మరియు రాజేశ్వరిలు భార్యాభర్తలు బంగారయ్య యొక్క తండ్రి చిల్లకూరు మండల పరిధిలోని మోమిడి గ్రామంలో ఉండగా అతనిని చూసేందుకు మోటార్ సైకిల్ పై గ్రామం నుండి బయలుదేరి వెళుతుండగా గూడూరు పట్టణం సాయిబాబా గుడి సమీపంలో సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మోటార్ సైకిల్ వెనుక నుండి ఢీకొనడంతో మోటార్ సైకిల్ పై కూర్చున్న రాజేశ్వరి ఆర్టీసీ బస్సు కింద పడిపోవడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది . గాయపడిన బంగారయ్య గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు . రాజేశ్వరి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు .

# మూడు నుంచి ముప్పైకి పడిపోయిన ఆదానీ

**ముంబై :**

ఒక చిన్న రిపోర్టు ఎంత పనిచేసింది? ప్రపంచంలోనే అప్రతిహత వేగంతో సంపద పోగేస్తున్న భారతీయ కుబేరుడిని ఊహించని విధంగా కుదిపేసింది. కేవలం నెల రోజుల్లోనే ప్రపంచ సంపన్నుల్లో మూడో స్థానంలో ఉన్న గౌతమ్ అదానీని ఇప్పుడు 30వ ర్యాంకుకు పడేసింది. ప్రపంచ బిలియనీర్స్ ఇండెక్స్‌లో ఇప్పుడాయన స్థానం తగ్గిపోయింది.వంటనూనెలు, గనులు, ఇంధనం, విద్యుత్ సరఫరా, డేటా సెంటర్లు, విమానాశ్రయాలు, కమోడిటీస్, సిమెంట్, నౌకాశ్రయాలు సహా ఎన్నో రంగాల్లో వ్యాపారాలు గౌతమ్ అదానీ గ్రూప్ సొంతం. ఐదేళ్లుగా ఆయన ప్రభ వెలిగిపోయింది. ఆయన కంపెనీల షేర్లు ఆకాశాన్ని తాకాయి. కనీవినీ ఎరగని రీతిలో, వ్యాపార పరిమాణం, లాభదాయకతతో సంబంధం లేకుండా ఎగిశాయి. అమెరికా షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ నివేదికతో ఆ షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. ఫలితంగా నెల రోజుల్లోనే ఆయన రూ.12 లక్షల కోట్ల మేర సంపద కోల్పోయారు. ఇప్పుడు ప్రపంచ కుబేరుల జాబితాలో 30వ స్థానానికి తగ్గిపోయారు.హిండెన్‌బర్గ్ షార్ట్ సెల్లింగ్ తర్వాత అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్ల విలువ రూ.12.06 లక్షల కోట్ల పతనమైంది. ఇది దేశంలోనే రెండో అత్యంత విలువైన టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో సమానం. అదానీ టోటల్ గ్యాస్‌పై



ఎక్కువ దెబ్బ పడింది. ఏకంగా 80.68 శాతం మార్కెట్ విలువ నష్టపోయింది. ఇక అదానీ ఎనర్జీ 76.62 శాతం విలువను కోల్పోయింది. అదానీ ట్రాన్స్‌మిషన్ జనవరి 24 నుంచి 74.21 శాతం నష్టపోయింది. అదానీ పవర్, అదానీ విల్మార్, గ్రూపు సిమెంటు కంపెనీలు, అదానీ పోర్ట్స్ చాలా వరకు మార్కెట్ విలువను కోల్పోవాల్సి వచ్చింది.ఈ పది కంపెనీల్లో గౌతమ్ అదానీ మార్కెట్ విలువ ప్రకారం 80.06 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. హిండెన్‌బర్గ్ నివేదిక ముందు ఆయన సంపద విలువ 120 బిలియన్ డాలర్లుగా ఉండేది. ఇప్పుడు 40 బిలియన్ డాలర్లకు తగ్గిపోయింది. ఫలితంగా ఆసియాలో నంబర్ వన్, ప్రపంచంలో మూడో స్థానం నుంచి పడిపోయారు. 2001లో అకౌంటింగ్ కుంభకోణం బయటపడ్డాక అమెరికా ఎనర్జీ కంపెనీ ఎన్‌రాన్‌ను ఈ ఘటన ప్రతిబింబిస్తోందని అమెరికా ట్రెజరీ మాజీ సెక్రెటరీ లారీ సమ్మర్ పేర్కొన్నారు.ప్రస్తుత సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి అదానీ గ్రూప్ ఒక మాస్టర్ ప్లాన్ వేసింది. తన ఆదాయ వృద్ధి లక్ష్యాన్ని ఈ గ్రూప్ ఏకంగా సగానికి సగం అడ్డంగా కోసేసింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 40 శాతం లక్ష్యం సాధించాలని అదానీ గ్రూప్ గతంలో భావిస్తే, ఇప్పుడు దానిని 15-20 శాతానికి పరిమితం చేసింది. గ్రూప్ చేపట్టే కొత్త మూలధన వ్యయాలు లేదా కొత్త పెట్టుబడులను కూడా నెమ్మదింపజేస్తోంది.భారీ స్థాయి పెట్టుబడులతో మార్కెట్‌ను ఒక ఊపు ఊపాలని, హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ రాక ముందు వరకు గౌతమ్ అదానీ భావించారు. మార్కెట్ మైండ్ బ్లాంక్ చేసే పెట్టుబడులతో, గ్రూప్ కంపెనీల సంపదను ఎవరూ ఊహించని రీతిలో పెంచాలని భావించారు. ఇప్పుడు, మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆ ప్లాన్స్‌ను అదానీ వాయిదా వేశారు. దూకుడుగా విస్తరించే బదులు, గ్రూప్ కంపెనీల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంపై ఎక్కువ దృష్టి సారించాలని అదానీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం మూడు నెలల పాటు కొత్త పెట్టుబడులు పెట్టకుండా ఆపితే, గ్రూప్‌లోని అన్ని కంపెనీల వద్ద 3 బిలియన్ డాలర్ల వరకు డబ్బు ఆదా అవుతుందట. ఆ డబ్బును రుణాన్ని తిరిగి చెల్లించడానికి లేదా నగదు నిల్వను పెంచడానికి ఉపయోగించుకోవచ్చని సమాచారం

# ములుగులో రియల్ దందా

**వరంగల్ :**

ములుగు జిల్లాలో ఇప్పుడు రియల్ కింగ్ ల దందా కొనసాగుతోంది. బర్త్ డే గిఫ్ట్ గా 2019 ఫిబ్రవరి 17న ములుగును జిల్లాగా ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్ నాలుగేళ్లైనా అన్ని శాఖల భవనాలు లేకపోవడంతోపాటు కలెక్టరేట్ భవన నిర్మాణంలో కూడా ఆలస్యం జరుగుతోంది. అయితే రియల్ దందా మాత్రం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లుతోంది. డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) శాఖను ములుగులో ఏర్పాటు చేయకపోవడంతో గ్రామపంచాయతీ అధికారుల హవా కొనసాగుతోంది. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ల పేరు చెబుతూ అందిన కాడికి దోచుకొని వ్యవసాయ భూములను కన్వర్షన్లు లేకుండానే వెంచర్లు చేస్తూ ప్రభుత్వ ఖజనాకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ చేయాలంటే అందుకు తగిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. చేసిన వెంచర్ లో కొంత భూమిని ప్రభుత్వం పేరున రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు ఆలయం, పార్కు, ఆటస్థలం, నీటి వసతికి ట్యాంకు తదితర నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే కొత్తగా ఏర్పడిన ములుగు జిల్లా కేంద్రంలో రియల్ వ్యాపారం విస్తరిస్తుందే తప్ప నిబంధనలను పాతరేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.తరచూ రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు దాడులు చేస్తూ రాళ్లను తొలగించిన ఘటనలు ఉన్నాయి. అయితే కొద్ది రోజులకే ముడుపులు దండుకొని తిరిగి వెంచర్లు వేసుకునేందుకు దారులు తెరిచినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో అడిషనల్ కలెక్టర్ త్రిపాఠి వద్దకు వెళ్లిన కొందరు వార్డు సభ్యులు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఫిర్యాదులు చేశారు. దానిపై స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే అనుమతి లేని వెంచర్లలో రాళ్లు తొలగించాలని ఆదేశించారు. అనంతరం మళ్లీ రియల్ హవా కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం ములుగు గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు ప్రేమ్ నగర్ సమీపంలోని రియల్ వెంచర్ లోని రాళ్లను తొలగించారు. దీంతో రియల్ వ్యాపారులు ఆ స్థలానికి చేరుకొని వార్డు సభ్యులతో వాగ్వివాదానికి దిగినట్లు సభ్యులు ఆరోపించారు. తాము అధికారుల ఆదేశాల మేరకు రూ.2 కోట్లు గ్రామపంచాయతీ అభివృద్ధికి అందజేశామని వ్యాపారులు తెగేసి చెప్పినట్లు వార్డు సభ్యులు చెబుతున్నారు. అయితే ఎవరికి ఇచ్చారనేది తెలియలేదన్నారు. ఆ సొమ్ము ఎవరికి ఇచ్చారనేది ఉన్నతాధికారులు తేల్చాలని, ముడుపులు తీసుకున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయం ఇలా ఉండగా ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ అడిషనల్ కలెక్టర్ వై.వి.గణేష్ ను బుధవారం కలిసి నిబంధనలకు విరుద్ధంగా రియల్ దందా చేస్తున్న వెంచర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ములుగు సర్పంచ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు రియల్ దందాను ఆసరాగా చేసుకొని ఒత్తిళ్లు తెస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. మొత్తంగా ఈ వ్యవహారం ములుగులో రాజకీయ దుమారం లేపుతోంది. అయితే రియల్ వ్యాపారులు మాత్రం ములుగు పట్టణం అభివృద్ధి చెందాలంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగాలనే వాదనలు వినిపిస్తున్నారు. ములుగులో డీటీసీపీ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆసక్తికరంగా హెల్త్ డైరక్టర్ కామెంట్స్

**ఖమ్మం:**

తెలంగాణ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరు కొన్నాళ్లుగా పరిపాలన పరంగా కంటే .. పొలిటికల్ సర్కిల్స్ లో ఎక్కువగా వినిపిస్తోంది. వివాదాస్పద వ్యాఖ్యలు, స్వచ్ఛంద కార్యక్రమాలతో నిత్యం వార్తల్లో ఉంటోన్న ఆయన.. మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ అరంగ్రేటం చేసేందుకు గ్రౌండ్ సిద్ధం చేసుకుంటున్నారంటూ జరుగుతోన్న ప్రచారానికి మరింత బలంగా చేకూర్చే విధంగా... శ్రీనివాస రావు కీలక కామెంట్స్ చేశారు. ఓ టీవీ ఛానల్ చర్చలో పాల్గొన్న ఆయన..... "సీఎం కేసీఆర్ ఆదేశిస్తే, కొత్తగూడెం ప్రజలు ఆశీర్వదిస్తే.. ఎలాంటి పదవి నుంచి అయినా ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి అంశంలోనూ కీలక వ్యాఖ్యలు చేశారు. తద్వారా కొత్తగూడెంపై ఫోకస్ చేసినట్లుగా చెప్పకనే చెప్పారు... హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస రావు."కొత్తగూడెం ప్రాంతాన్ని సుమారు 5 దశాబ్దాల నుంచి చూస్తున్నాను. నియోజకవర్గ పరిధిలో అనేక సహజ వనరులు ఉన్నాయి. అయితే ఆ ప్రాంతంలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. తెలంగాణ వచ్చిన తర్వాతే అభివృద్ధి పథంలో నడుస్తోంది. విద్య, ఆరోగ్యం, ఉపాధి పరంగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. సీఎం కేసీఆర్ గారు హెల్త్ డైరెక్టర్ గా నాకు అవకాశం ఇచ్చారు. ఆరోగ్య తెలంగాణను నిర్మించే క్రమంలో నన్ను కూడా భాగం చేసినందుకు వారికి రుణ పడి ఉంటాను. తప్పకుండా రాబోయే



రోజుల్లో కేసీఆర్ గారు ఆదేశిస్తే.. నా కొత్తగూడెం ప్రజలు ఆశీర్వదిస్తే.. ఎలాంటి పదవి నుంచైనా సరే ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. రాబోయే రోజుల్లో కేసీఆర్ గారు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాను" అంటూ శ్రీనివాస రావు చేసిన కామెంట్స్.. సంచలనంగా మారాయికరోనా సమయంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియంత్రణ చర్యల అమలులో కీలక పాత్ర పోషించిన డీహెచ్ శ్రీనివాసరావు... గతేడాది కాలంగా కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జీఎస్ఆర్ ట్రస్ట్ పేరిట జాబ్ మేళాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పండుగల సమయంలో వేడుకలు జరుపుతున్నారు. ఆపదలో ఉన్న వారికి వ్యక్తిగత సహాయం అందిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు ఇవన్నీ చేస్తున్నారన్న ప్రచారం జోరుగా జరిగినా... ఇన్నాళ్లూ ఎన్నికల్లో పోటీపై స్పష్టమైన ప్రకటన చేయని ఆయన.... ఇవాళ మాత్రం పరోక్ష సంకేతాలు పంపారు. కేసీఆర్ ఆదేశిస్తే... పొలిటికల్ ఎంట్రీకి రెడీ అని తేల్చి చెప్పారు. తద్వారా... కొత్తగూడెం నియోజకవర్గంలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపారు.కొత్తగూడెం నియోజకవర్గంలో రాజకీయ అవకాశాల కోసం అనేక మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థానంలో వనమా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆయన.... ఆ తర్వాత బీఆర్ఎస్ లో చేరారు. మరోసారి ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవాలని చూస్తున్నారు. మరోవైపు ఇదే స్థానంపై ఫోకస్ చేశారు.. జలగం వెంకటరావు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు కూడా ఇదే స్థానంపై దృష్టి సారించారు. 2009లో ఇక్కడ్నుంచే ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మునుగోడు ఉప ఎన్నిక వేళ లెఫ్ట్ పార్టీలు, బీఆర్ఎస్ మధ్య పొడిచిన పొత్తు.. ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగితే... కొత్తగూడెం సీటు కోసం సీపీఐ గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో... కొత్తగూడెం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరు నిలుస్తారు ? లేక పొత్తుల్లో భాగంగా ఈ సీటు కమ్యూనిస్టులకి వెళుతుందా అన్న చర్చ సాగుతోన్న సమయంలో.... హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస రావు చేసిన వ్యాఖ్యలు... కొత్తగూడెం పాలిటిక్స్ ను మరింత ఆసక్తికరంగా మార్చాయి. మరి శ్రీనివాస రావు కోరికను సీఎం కేసీఆర్ నెరవేరుస్తారా ? హేమాహేమీలను కాదని.. ఆయనకు కొత్తగూడెం టికెట్ ఇస్తారా ? శ్రీనివాసరావు ఆశిస్తున్న ఆ "పదవి" దక్కుతుందా లేదా .. ? ఈ ప్రశ్నలకు మరికొన్ని రోజుల్లోనే సమాధానం రానుంది.

# ఈ సారైనా అవకాశం దక్కేనా

**హైదరాబాద్ :**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరెవరికి ప్రాతినిధ్యం లభిస్తుందన్న దానిపై ఆ□సక్తి నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగుతున్న ఏఐసీసీ ప్లీనరీ నేటితో ముగియనున్న నేపథ్యంలో ఈ ప్లీనరీ అనంతరం ఏర్పాటు చేయనున్న సీడబ్ల్యూసీలో ఎవరికి చోటు దక్కుతుందన్న దానిపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న టి.సుబ్బిరా□మిరెడ్డి (ఆంధ్రప్రదేశ్)తోపాటు తెలంగాణ నుంచి న□లు□గురైదుగురు నేతలు ఈ రేసులో ఉన్నారు. అ□యితే, సుబ్బిరామిరెడ్డికి మళ్లీ రెన్యువల్ అవుతుందని, మిగిలిన నేతలకు సీడబ్ల్యూసీలో చోటు దక్కే అవకాశం లేదని 10 జన్‌పథ్ వర్గాలు చెబుతున్నాయి.సీడబ్ల్యూసీ సభ్యత్వం కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దగా డిమాండ్ కనిపించకపోయినా తెలంగాణ నుంచి నలుగురైదుగురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. వీరిలో స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. తనకు సీడబ్ల్యూసీ అవకాశం తప్పకుండా వస్తుందని, సీడబ్ల్యూసీ సభ్యుని హోదాలోనే పాదయాత్రను ప్రారంభిస్తాననే ధీమాతో ఉన్నారు. సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మ□య్య కూడా సీడబ్ల్యూసీలో స్థానాన్ని ఆశిస్తున్నారు.టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి పేరు నాలుగైదు నెలలుగా వినిపిస్తోంది. సీడబ్ల్యూసీకి ఎన్నికలు జరిగితే తాను పోటీచేసి, తెలంగాణ, ఏపీ, కర్ణాటక సభ్యుల ఓట్లతో గెలుపొందాలని ఆయన భావించారు. కానీ సీడబ్ల్యూసీ సభ్యులను ఎన్నిక ద్వారా కాకుండా ఏఐసీసీ చీఫ్ ఎంపిక చేయాలని ప్లీనరీలో నిర్ణయించడంతో ఇప్పుడు తనను ఎంపిక చేస్తారనే నమ్మకంతో ఆయన ఉన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులుగా ఏపీ నుంచి రఘువీరారెడ్డి పేరు వినిపిస్తోంది.ఆయనతోపాటు తెలంగాణలోని ఏఐసీసీ కార్యద□ర్శు□ల్లో ఒకరికి ప్రమోషన్ ఇస్తారని తెలుస్తోంది. అయితే, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఇతర రాష్ట్రాలకు పార్టీ ఇన్‌చార్జిగా న్యాయం చేయలేమని, రాష్ట్రంలోనే ఉండాల్సి వస్తుందని కొందరు సీనియర్ నేతలు నిరాసక్తత వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

# ముగిసిన ప్రీతి అంత్యక్రియలు

**వరంగల్ :**

మెడికో మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు ఓయూ జేఏసీ నేతలు. ఈ ఎపిసోడ్‌లో పోలీసులు వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. ప్రీతి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణలో మహిళలకు రక్షణలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు. ప్రీతి డెత్ వెనుక ఎవరున్నారో సమగ్రవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారామె.మారుమూలతండా నుంచి వచ్చి డాక్టర్ అయ్యి భవిష్యత్‌లో ఎందరికో వైద్య సేవలు అందిస్తుంది అని భావించిన ప్రీతి అర్థాంతరంగా ఈ లోకాన్ని వీడింది. అశ్రునయనాల మధ్య మెడికో ప్రీతి అంత్యక్రియలు ముగిశాయి. స్వగ్రామం జనగామ జిల్లా గిర్నితండాలో జరిగిన అంత్యక్రియలకు ఊరు ఊరంతా తరలివచ్చింది. ప్రీతికి కన్నీటి వీడ్కోలు పలికింది. ఇక ప్రీతి తల్లిదండ్రుల్ని ఓదార్చడం అక్కడున్న వారి వల్ల కాలేదు. ఎంతో భవిష్యత్తు ఉన్న తమ బిడ్డ అర్ధంతరంగా వీడి వెళ్లిందంటూ గుండెపగిలేలా ఏడ్చారు. మరోవైపు ప్రీతి చావుకి కారణమైన వారిని వదిలిపెట్టొద్దని.. కఠినంగా శిక్షించాలని నినదించాయి గిరిజన సంఘాలు.ప్రీతి అంత్యక్రియలకు గ్రామస్తులు,



స్థానికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వేర్వేరు పార్టీల నాయకులు కూడా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రీతి అంత్యక్రియలతో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నిమ్స్‌లో ఐదురోజుల పాటు మృత్యువుతో పోరాడిన ప్రీతి.. ఆదివారం రాత్రి 9. 10 గం.లకు చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారు. డెత్ సర్టిఫికెట్‌పై సంతకం చేసేందుకు కుటుంబ సభ్యులు ససేమిరా అనడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. మరోవైపు గిరిజన, విద్యార్థి సంఘాల రాకతో నిమ్స్ పరిసరాల్లో నిన్న రాత్రంతా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.టెన్షన్ పరిస్థితుల మధ్య పోస్టుమార్టం జరిగింది. అనంతరం స్వగ్రామం గిర్నితండాకు ప్రీతి మృతదేహాన్ని తరలించారు. ప్రీతి డెడ్‌బాడీని చూసి గ్రామస్థులంతా భోరుమన్నారు. అన్యాయంగా బిడ్డను బలితీసుకున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం ప్రీతి అంత్యక్రియలు జరిగాయి. కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులంతా ప్రీతికి కన్నీటి వీడ్కోలు పలికారు.ప్రీతి ఫ్యామిలీకి రూ.30 లక్షల పరిహారం అందనుంది. గవర్నమెంట్ రూ.10 లక్షలు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.20 లక్షలు పరిహారం ప్రకటించినట్లు ప్రీతి తండ్రి వెల్లడించారు. అలాగే ఫ్యామిలీలో ఒకరికి గెజిటెడ్ ఉద్యోగం ఇవ్వనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారన్నారు. పంచాయతీరాజ్ శాఖలో గవర్నమెంట్ జాబ్ ఇప్పిస్తామని, అంతేకాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపిస్తానని మంత్రి చెప్పినట్లు ప్రీతి తండ్రి తెలిపారు. ఊబాఅ, ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# భర్త హత్యకేసులో భార్య, ప్రియుడు అరెస్టు

**నందిగామ**

కంచికచర్ల పోలీస్ స్టేషన్ లో మూడు రోజుల క్రితం ప్రియుడు తో కలిసి,భర్త ను హత్య చేసిన కేసుపై నందిగామ ఏసిపి నాగేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. భర్త కుంచెం రామారావుని,భార్య భార్గవి ముందే పతకం ప్రకారం ప్రియుడు ప్రవీణ్ అతని ఇద్దరు స్నేహితులతో కలిసి రామారావు ను హత్య చేశారు. రామారావు ను ఊపిరి ఆడకుండా కవర్ తొడిగి,గుండెలపై గట్టిగా పిడిగుద్దులు గుద్ది,రామారావు అరవడంతో చుట్టూ పక్కల వారు రావడం తో ప్రవీణ్ అతని స్నేహితులు పారిపోవడంతో ఇంటి పక్కనున్న వారు నందిగామ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ మరణించారని ఏసిపి తెలిపారు. కుంచెం రామారావు భార్య భార్గవి కంచికచర్ల మండలం మొగులూరు గ్రామ సచివాలయంలో ఏఎన్ఎం గా పనిచేస్తుంది. హత్యలో మృతుడు భార్య కూడా సహకరించింది.నలుగురు ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలిస్తామని ఏసిపి నాగేశ్వర్ రెడ్డి అన్నారు .

# ఎర్ర చందనం రవాణా-ఆరుమంది అరెస్టు

**కడప**

జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. కొరియర్ సర్వీస్ మాటున తాడిపత్రి- ముద్దునూరు బైపాస్ రోడ్డులో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న 6మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్ అయ్యారు. ప్రొద్దుటూరు కు చెందిన స్మగ్లర్ భాస్కర్ రెడ్డితో పాటు, రాజస్థాన్ రాష్ట్రం కు చెందిన రాజేంద్ర అనే స్మగ్లర్ అరెస్టు అయ్యాడు. ప్రొద్దుటూరు కు చెందిన స్మగ్లర్ భాస్కర్ రెడ్డి పై పీడి యాక్ట్ చట్టం నమోదు అయింది. వీరి వద్ద నుంచి సుమారు 40 ఎర్రచందనం దుంగలు,1 గూడ్స్ వాహనం, 1 స్కార్పియో, 4 మోటార్ సైకిల్ వాహనాలు, 7 సెల్ ఫోన్లు,5 గొడళ్ళు, 1 ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ స్వాధీనంచేసుకున్నామని జిల్లా ఎస్పీ అన్బు రాజన్ వెల్లడించారు.

## పిన్నెల్లి ఆగడాలు ఎక్కువయ్యాయి

**పల్నాడు**

నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నకారంపూడి టీడీపీ బిసి నేత నాగేశ్వరరావుని మాచర్ల టీడీపీ ఇంచార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సోమవారం పరామర్శించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే దారుణంగా దాడులు చేస్తారా. మాచర్ల లో పిన్నెల్లి అన్నదమ్ముల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని అన్నారు. కనిపించిన ప్రతి భూమికి దొంగ డాక్యుమెంట్లు పుట్టించి వాటిని దొడ్డి దారిన స్వాధీనం చేసుకుంటున్నారు. మాచర్ల మద్యం,గుట్కా,మట్కా, గంజాయికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఓపిక ఉన్నంత కాలం ఏం చేసినా ఓర్చుకుంటాం. మా కార్యకర్తలకు ఓపిక నశిస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. పోలీస్ స్టేషన్లలోకి కూడా వచ్చి వైసీపీ వర్గీయులు దాడులు చేయడం పోలీసులు సిగ్గు పడాల్సిన విషయం. పోలీస్ స్టేషన్లని కూడా వైసీపీ నేతలకి అప్పగించారా. మా పార్టీ కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి మా కార్యకర్తలపైనే హత్యాయత్నం కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

## ప్రీతి మృతిపై మావోల లేఖ

**వరంగల్**

డాక్టర్ ప్రీతి మృతి పై ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ కార్యదర్శి వెంకటేష్ పేరిట మావోయిస్టు పార్టీ సోమవారం ఒక లేఖ విడుదల చేసింది. ఆమె మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ కార్యదర్శి వెంకట్ పేరిట లేఖను విడుదల చేశారు. ర్యాగింగ్ వల్లే ప్రీతి ఆత్మహత్య చేసుకున్నా... అధికారులు దాన్ని కప్పిపుచ్చడంతోపాటు సైఫ్ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాలేజీల్లో ర్యాగింగ్ నిత్యకృత్యమైందని వారు లేఖలో పేర్కొన్నారు...

## డీఎస్ కు తీవ్ర అస్వస్థత

**నిజామాబాద్ :**

మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని ఆయన చిన్న కుమారుడు, బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ట్వీట్ చేశారు. బంజారాహిల్స్ లోని సిటీ న్యూరో ఆస్పత్రికి చికిత్స కోసం సోమవారం తరలించినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం డి. శ్రీనివాస్ కు వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కొంతకాలం నుంచి డీఎస్ వయసురీత్యా పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల డీఎస్ నిజామాబాద్ నగరంలోని ఆయన సొంత నివాసంలో మూడు రోజుల పాటు ఉన్నారు. నగరంలోని ఆయన అనుచరులతో వివిధ అంశాలపై చర్చించారు.నిజామాబాద్ కు వచ్చినపుడు డీఎస్ ఆరోగ్యంగానే ఉన్నారు. అయితే కొన్ని రోజుల నుంచి ఆయన తరచూ అస్వస్థతకు గురవుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురి కావటంతో ఆస్పత్రికి తరలించారు. డీఎస్ ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అందువల్లే ఈరోజు, రేపు అంటే ఫిబ్రవరి 27, 28వ తేదీల్లో ఏర్పాటు చేసిన తన కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నట్లు ధర్మపురి అర్వింద్ తెలిపారు.

## పుతిన్ సొంత మనుషులే చంపుతున్నారు

న్యూఢిల్లీ:
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఏదో ఒకరోజు తన ఆంతరింగికులతోనే చంపబడతాడని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ పేర్కొన్నారు. న్యూస్‌వీక్‌లోని ఒక నివేదిక ప్రకారం, ఈ వ్యాఖ్యలు జెలెన్స్కీ ఉన్న 'ఇయర్' అనే ఉక్రేనియన్ డాక్యుమెంటరీలో భాగంగా బయటకు వచ్చాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఈ డాక్యుమెంటరీని విడుదల చేసినట్లు అవుట్‌లెట్ తెలిపింది. మిస్టర్ జెలెన్స్కీ మాట్లాడుతూ.. రష్యా అధ్యక్షుడి నాయకత్వంలో అసంతృప్తుల కాలం వస్తుందని, అతని సన్నిహితుడు అతనికి వ్యతిరేకంగా చర్య తీసుకునేలా ప్రేరేపించబడతాడని జెలెన్స్కీ అన్నారు.రష్యాలో పుతిన్ పాలనపై ఆగ్రహాలు వెల్లువెత్తుతాయని.. ఆమె నియంతను అతని అనుచరులే చంపేస్తారని.. వారు చంపడానికి కారణాన్ని కూడా వెతుకుతారని.. ఎప్పుడు? ఎలా? అనేది మాత్రం తనకు తెలియదన్నారు. పుతిన్ అంతర్గత సర్కిల్‌లో నిరాశ గురించి రష్యా నుండి నివేదికలు వెలువడిన తర్వాత ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడి సన్నిహిత మిత్రులు అతని పట్ల విసుగు చెందుతున్నారని వాషింగ్టన్ పోస్ట్ ఇటీవల పేర్కొంది. యుద్ధరంగం నుండి వారి సైనికులు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది. క్రిమియన్ ద్వీపకల్పంపై ఉక్రేనియన్ నియంత్రణకు తిరిగి రావడం యుద్ధం ముగింపులో భాగమని జెలెన్స్కీ ఆదివారం నాడు చెప్పారు. ఇది మా భూమి.. మన ప్రజలు.. మన చరిత్ర.. ఉక్రెయిన్‌లోని ప్రతి మూలకు ఉక్రెయిన్ జెండాను తిరిగి అందిస్తామని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ఓ డాక్యుమెంటరీలో ఉక్రెయిన్ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో జెలెన్స్కీ తాజా వ్యాఖ్యలపై రష్యా ఇప్పటివరకు స్పందించలేదు.

# బీఆర్ఎస్ తోనే మైనార్టీల అభివృద్ధి

**వరంగల్**



ఆర్ ఎస్ తోనే మైనారిటీల అభివృధి జరుగుతుంది అని వరంగల్ తూర్పు శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ అన్నారు. ఈసందర్భంగా 37వ డివిజన్ మైనారిటీ కాలనీ లో కూడా నిధులు 30లక్షలతో మోరి నుండి మోరి వరకు ఇఇ రోడ్ నిర్మాణం కోసం శంఖుస్థాపన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాక సందర్భంగా టపాసులు కాల్చి, పువ్వులు చల్లి శాలువాలు కప్పి, బొకే లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో మైనార్టీల అభివృద్ధి కుంటూపడిందని కెసిఆర్ నాయకత్వంలో మైనారిటీ లకు గురుకుల్లాలు, షాదీముభారక్ అలాగే షాదీఖానాల నిర్మాణం, అషుర్ ఖానాల నిర్మాణం, కాబ్రస్థాన్ పరిరక్షణ లు మొదలైన పనులతో పాటు అనేకరకాల అభివృద్ధి కి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్ నేతృత్వంలో మైనారిటీ ల అభివృద్ధిజరుగుతుందని అన్నారు. అలాగే గతంలో గుండుచెరువు నిండి మైనారిటీ కాలనీ మునిగిపోయేదప్రతేకంగా నిధులు తెప్పించి ఆండర్ డ్రైనేజీ నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించామని అలాగే ఇప్పుడు సిసి రోడ్ నిర్మాణం తో కాలని రూపు మారుతుందని అలాగే డ్రైనేజీ, ఇంటర్నల్ రోడ్స్ ఆశురుకాన నిర్మాణం చేస్తామని. మైనారిటీ లందరు ఐక్యంగా ఉండాలని కాలనీ అభివృద్ధి కి అందరు ముందుకు రావాలని అన్నారు..

ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సిరాజోద్దీన్, మాజీ కార్పొరేటర్స్ బిళ్ళ కవితశ్రీకాంత్, దామోదర్ యాదవ్, నాయకులు రాంకీ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సంగరబోయిన విజయ్, స్థానిక నాయకులు లతో పాటు ముఖ్య నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట జిల్లా లో నిందితుడు సైఫ్ శవయాత్ర

**మహబూబాబాద్**



స్థానిక నెహ్రూ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు లంబాడి హక్కుల పరిరక్షణ సంఘం అధ్వర్యంలో శవయాత్ర నిర్వహించారు. డాక్టర్ ప్రీతిని ఎంతో మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన ఆమె చావుకు కారకులైన సైకో సైఫ్ ను వెంటనే ఉరితీయాలి అని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి హెచ్వోడీ, ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేసి సిట్టింగ్ జడ్జి తోటి విచారణ జర్పించాలని డిమాండ్ చేసారు. ప్రీతి కుటుంబానికి 5కోట్ల ఎక్స్గ్రేషియా మరియు వారి కుటుంబంలో ఒకరికి గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలి. ప్రీతి ది హత్య కేసుగా నమోదు చేయాలి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వీటి అన్నిటి పైన స్పందించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులా ప్రజా రాజకీయ పార్టీలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమ్ నాయక్ మాట్లాడుతూ బంగారు తెలంగాణలో, దాడులు, అత్యాచారాలు, మానభంగాలు, ర్యాగింగ్లు, ఉండవని చెప్పిన మన ముఖ్యమంత్రి గారు 8 సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఎక్కడ జరగని ఘోరాలు, నేరాలు, జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని అన్నారు.

## లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయాలి

**నంద్యాల**




లయన్స్ డిస్ట్రిక్ట్ 316 జె గవర్నర్ రామచంద్ర ప్రకాష్ నంద్యాల అధికార పర్యటన సందర్భంగా స్థానిక బాలాజీ కళ్యాణమండపం లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్ర ప్రకాష్ మాట్లాడుతూ లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడం అవసరం అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా పాల్గొన్న రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో లయన్స్ క్లబ్ గత 50 సంవత్సరాలు పైగా చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా సేవా కార్యక్రమాల్ని నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నంద్యాల కార్యదర్శి లయన్ కూరా ప్రసాద్ తండ్రి శ్రీనివాస్ స్వర్గధామం అభివృద్ధికి 30 వేల రూపాయలు విరాళం గవర్నర్ చేతుల మీదుగా అందించారు.కార్యదర్శి కూర ప్రసాద్ కోశాధికారి రత్న కుమార్ గత సంవత్సర కాలంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు నివేదిక సమర్పించారు.సభ ప్రారంభంలో లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ రామచంద్ర ప్రకాష్ నుగౌరవ అతిధులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ దస్తగిరి రెడ్డి, డాక్టర్ రవికృష్ణ , లయన్స్ క్లబ్ క్యాబినెట్ కార్యదర్శి పసుపుల సుబ్రహ్మణ్యం, కార్యక్రమాల క్యాబినెట్ కార్యదర్శి సత్యనారాయణ లను నంద్యాల లయన్స్ క్లబ్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ చైర్మన్ కసెట్టి చంద్రశేఖర్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ సహదేవుడు శ్రీకాంత్ రవి ప్రకాష్ భవనాసి నాగ మహేష్ అధిక సంఖ్యలో లయన్స్ సభ్యులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు.

# సీబీఐ చేతిలో కీలక ఆధారాలు

**న్యూఢిల్లీ:**

ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను అరెస్ట్ చేసే ముందుకు సీబీఐ చేతికి కీలక ఆధారాలు చిక్కినట్టు సమాచారం. సిసోడియా కంప్యూటర్ నుంచి డిలీట్ చేసిన ఫైల్స్‌ని రిట్రీవ్ చేసినట్టు తెలుస్తోంది. లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కీలక ఆధారాలన్నింటినీ సిసోడియా చెరిపేశారని ఆరోపిస్తున్న సీబీఐ మొత్తానికి వాటిని రిట్రీవ్ చేసింది. ఈ ఏడాది జనవరిలో ఆయన కంప్యూటర్‌ను సీజ్ చేసింది. కొన్ని ఫైల్స్‌ను డిలీట్ చేసినట్టు గుర్తించిన అధికారులు వెంటనే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. డిలీట్ చేసిన ఫైల్స్‌ను రికవరీ చేసిన ఫోరెన్సిక్ విభాగం...ఆ వివరాలను సీబీఐ అధికారులకు అందించింది. కొంత డేటాతో పాటు ఫైల్స్ పంపింది. వీటిని ముందుగా వాట్సాప్‌లో పంపారని, ఆ తరవాతే కంప్యూటర్‌లో సేవ్ చేశారని వెల్లడించింది. తరవాత వీటిని తొలగించినట్టు నిర్ధరించింది. సిసోడియా కార్యాలయంలోని ఈ కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకుంది. సీఆర్‌పీసీ సెక్షన్ 91 ప్రకారం ఛార్చ్‌షీట్ దాఖలు చేసింది సీబీఐ. అయితే...ఈ కేసుకి సంబంధించి సప్లమెంటరీ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేసే పనిలో ఉంది దర్యాప్తు సంస్థ. మరిన్ని ఆధారాలు సేకరిస్తే కేసు స్ట్రాంగ్ అవుతుందని భావిస్తోంది. ఇప్పటికే సీబీఐ సిసోడియాను రౌజ్ అవెన్యూ కోర్ట్‌కు తరలించింది. మనీశ్ సిసోడియా అరెస్ట్‌పై ఆప్ తీవ్రంగా మండి పడుతోంది. పలు రాష్ట్రాల్లో కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతోంది. ఛండీగఢ్, ఢిల్లీ, భోపాల్‌లో ఆందోళనలు చేస్తున్నారు. బీజేపీ కార్యాలయాల ఎదురుగా ఆప్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. కనీసం 200 మంది కార్యకర్తలతో ఆందోళనలు చేపట్టాలని స్థానిక నేతలు ప్లాన్ చేసుకుంటున్నారు.

## ప్రతి క్లాస్ కు స్మార్ట్ టీవీ

**విజయవాడ:**

ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంపై దృష్టి సారించింది అన్నారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. విజయవాడలోని ఆంధ్ర లయోల కాలేజిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించాలని ఉపాధ్యాయులను కోరారు.. ఈ ప్రభుత్వం విద్యార్థుల కోసం చేసే ఆలోచనను విద్యార్థులు గుర్తించాలన్న ఆయన.. రాబోయే కాలంలో కమ్యూనికేషన్ ఆధారంగా ప్రతి తరగతిలో స్మార్ట్ టీవీ అందుబాటులోకి తీసుకువస్తాం అన్నారు.. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గోరు ముద్ద, విద్యా దీవెన, విద్యా కానుక వంటి పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు.మరోవైపు.. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అనేది నిషిద్ధం అని స్పష్టం చేశారు మంత్రి బొత్స.. ర్యాగింగ్ చేస్తే శిక్షతప్పదని హెచ్చరించిన ఆయన.. విద్యార్థులకు ఏ ఇబ్బంది ఉన్నా.. అధ్యాపకులకి చెప్పాలన్నారు.. స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు ర్యాగింగ్ పై అవగాహన కల్పించాలని సూచించారు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. కాగా, విజయవాడలోని ఆంధ్ర లయోల కాలేజిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 260 ప్రభుత్వ పాఠశాల ప్రాజెక్టులను ప్రదర్శించారు.. ఈ ఎగ్జిబిషన్‌కు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్య లక్ష్మి, కమిషనర్ స్వప్నికల్ దినకర్, విద్యాశాఖ అధికారులు.. తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## అయ్యన్నకు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ:**

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.. అయ్యన్నపాత్రుడుపై ఫోర్జరీ కేసు దర్యాప్తుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.. ఈ కేసులో జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.. ఫోర్జరీ సెక్షన్లు ఐపీసీ 467 కింద దర్యాప్తు చేయవచ్చని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు.. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది.. కేసు దర్యాప్తు సమయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.. అయితే, బిల్డింగ్ ప్లాన్ విషయంలో సంతకాలు ఫోర్జరీ చేశారన్న కేసులో అయ్యన్నపాత్రుడు పై ఆరోపణలు వచ్చాయి.. ఈ కేసు విచారణ సందర్భంగా ప్రధాన కేసును మెరిట్ ఆధారంగా విచారణ చేయాలని హైకోర్టుకు సూచించింది సుప్రీంకోర్టు.అయితే, ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి తప్పుడు పత్రాలు సృష్టించిన కేసులో అయ్యన్నపాత్రుడు ఆయన కుమారుడు రాజేష్‌పై గతంలో ఫోర్జరీ కేసు నమోదైంది.. అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాచపల్లి రిజర్వాయర్ పంట కాలువపై రెండు సెంట్లు మేర స్థలంలో అక్రమంగా ప్రహరి నిర్మాణం చేసినట్టు అభియోగాలున్నాయి.. నర్సీపట్నంలోని అయ్యన్నపాత్రుడు ఇంటికి ఆనుకుని పంట కాలువ ఉంది. నిర్మాణ సమయంలో బిల్డింగ్ అనుమతి కోసం ఇచ్చిన దరఖాస్తులో కూడా తాము నిర్మించబోయే ఇంటికి దక్షిణం, పశ్చిమాన పంట కాలువ ఉందని పేర్కొనగా.. ఏకంగా పంట కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణాన్ని చేపట్టినట్టు ఆరోపణలు వచ్చాయి.. ఈ వ్యవహారం మొత్తం రెవెన్యూ అధికారుల సర్వేలో బయటపడినట్టు చెబుతున్నారు.. ఆ తర్వాతా అక్రమ కట్టడాలని కూల్చేందుకు ప్రయత్నించడంతో అడ్డుకున్నారు.. ఆ తర్వాత ఫోర్జరీ సంతకాలతో పత్రాలను సృష్టించి సక్రమ నిర్మాణమే అని చెప్పుకునేందుకు యత్నించారంటూ అధికారులు కేసు పెట్టారు. ఈ వ్యవహారం హైకోర్టు వరకు వెళ్లింది.. అక్కడ అయ్యన్నపాత్రుడికి ఊరట దక్కినా.. ఇప్పుడు సుప్రీంకోర్టులో మాత్రం ఎదురుదెబ్బ తగిలింది.

## బీజేపీ విధానాలతో దేశం చిన్నాభిన్నం

**అదిలాబాద్**

బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో చేస్తున్న విధానాలతో దేశం చిన్నాభిన్నం అవుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిచేందుకు పార్టీ ఆధ్వర్యంలో మార్చి23 నుంచి ప్రచారజాతాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బీజేపీ పాలనలో రెండుకోట్ల ఉద్యోగాలు, 80 లక్షల కోట్ల నల్లడబ్బు వాపసు అంశాలు తుంగలోకి తొక్కారన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల్లో నుంచి పెట్టుబడిదారులకు అప్పులు ఇచ్చి దివాళా చేయించారని ఆరోపించారు. అదానీ కంపెనీల చర్యలతో 50వేల కోట్లు నష్టం జరిగిందన్నారు. మరోపక్క గోవధ నిషేధం పేరుతో క్రైస్తవులు, ముస్లింలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 11లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరుల విషయం కేంద్రం పరిధిలోని అంశం అంటూ రాష్ట్ర ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబించడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి ప్రజలకు వివరించేందుకే జాతాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# యాదాద్రీశుడిని చెంత 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' దర్శకనిర్మాతలు



రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కించిన తాజా మూవీ 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. కోనేరు కల్పన నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాలో సోహెల్, మృణాళిని హీరోహీరోయిన్లుగా నటించారు. కె.అచ్చిరెడ్డి సమర్పిస్తున్న ఈ సినిమా మార్చి 3న విడుదల కానుంది. ఇక సినిమా విడుదల సందర్భంగా సినిమా యూనిట్ సభ్యులతో కలిసి సినిమా దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, సమర్పకుడు అచ్చి రెడ్డిలతో కలిసి నిర్మాత కోనేరు కల్పన యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' సినిమా విజయవంతం కావాలని లక్ష్మీ నరసింహస్వామిని ప్రార్ధించారు. ఇక అనంతరం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' యూనిట్ సభ్యులకు ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పేద కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

**శంకరపట్నం**

పేద కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఉన్నారని మానకొండూర్ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక రథసారధి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టి పేదలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే పొద్దుపొడుపు కార్యక్రమంలో భాగంగా, మండలంలోని తాడికల్, వంకాయ గూడెం, కేశవపట్నం, మొలంగూర్ గ్రామాల్లో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు.కళ్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దేశ ప్రయోజనం కోసం బీఆర్ఎస్ పార్టీని స్థాపించి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. పేద కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు తెలంగాణలో ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలైన రైతుబంధు, దళిత బంధు, రైతు బీమా దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేసీఆర్ కంకణ బద్ధుడై ముందుకు సాగుతున్నాడన్నారు.అందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా పేద కుటుంబాల ఆడబిడ్డ కళ్యాణానికి రూ.1 లక్ష116లను కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రైతు ఆర్థిక ఎదుగుదల కోసం రైతుబంధు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ పులికోట రమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, రాజయ్య, భద్రయ్య, రవి, ఎంపీటీసీ ఎస్కే మోయిన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వీరస్వామి, మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం చైర్మన్ సాగి మలహల్ రావు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతం రాజు సుధాకర్ ను గెలిపించుకోవాలి

**అనకాపల్లి**

వచ్చేనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు,గృహ సారధులతో కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి అని ఉత్తరాంధ్ర రీజనల్ ఇంచార్జ్, టీటీడీ చైర్మన్ ...సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక రింగ్ రోడ్ లో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో సోమవారం వైసిపి పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాలమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి మూడు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు అనకాపల్లి అభివృద్ధికి కృషి చేస్తాం., అదేవిధంగా విద్యార్థులు బస్సు పాసుల విషయం పై దృష్టి పెట్టి పాసులు అనకాపల్లి నుండి విశాఖ వరకు పనిచేసే విధంగా మాట్లాడతాను అన్నారు.

మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి నూకంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి 3కోట్లు కేటాయించిన వై వి సుబ్బారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ మాట్లాడుతూ తన విజయానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దాడి వీరభద్రరావు, ఎంపీ డాక్టర్ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ దాడి రత్నాకర్ తదితరులు మాట్లాడారు.

# ఢిల్లీకి రండి... బీజేపీ నేతలకు పిలుపు

**హైదరాబాద్ :**

తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు భారతీయ జనతా పార్టీ సన్నాహాలను ప్రారంభించింది. ఇప్పటికే.. మిషన్ 90తో వ్యూహాలను రచించిన బీజేపీ.. నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ తరుణంలోతెలంగాణ ముఖ్యనేతలకు ఢిల్లీ బీజేపీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. రాష్ట్ర బీజేపీ నాయకులతో సమావేశం అవుతారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల, వివేక్, జితేందర్ రెడ్డి తో పాటు పలువురు ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. మిషన్ 90, తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికల ప్రణాళిక పై చర్చ జరగనున్నట్లు పేర్కొంటున్నారు.అధిష్టానం నుంచి పిలుపు రావడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సహా కీలక నేతలంతా కూడా ఢిల్లీ చేరుకుంటున్నారు. మిషన్ 90 పేరుతో ఇప్పటికే తెలంగాణలో ఆపరేషన్ చేపట్టింది పార్టీ. ఇందుకోసం 10 నెలలకు కావాల్సిన రోడ్‌మ్యాప్ ఇచ్చింది. ఇందులో భాగంగా యాక్షన్ ప్లాన్ అమలు తీరుతో పాటు.. నాయకత్వానికి దిశా నిర్దేశం చేసే అవకాశం ఉంది.రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇంకా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం.. పార్టీ నేతల మధ్య ఏకాభిప్రాయాన్ని సైతం తెలుసుకున్నారు.చిరంజీవి నాగార్జునలతో అనురాగ్ ఠాకూర్ భేటీతెలంగాణ పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్.. టాలీవుడ్ ప్రముఖులతో భేటీ అయ్యారు. అనురాగ్ ఠాకూర్ ఆదివారం రాత్రి మెగాస్టార్ చిరంజీవి నివాసానికి వెళ్లారు. అక్కడ చిరంజీవితో పాటు నాగార్జున, అల్లు అరవింద్ సహా పలువురు ప్రముఖులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు విషయాల గురించి కేంద్ర మంత్రి ఠాకూర్, సినీ ప్రముఖులతో చర్చించారుకాగా, దీనికి సంబంధించిన ఫోటోలను చిరంజీవి సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్.. తన వద్దకు రావడానికి సమయం కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆరోగ్య సేవలు..భేష్ కేంద్రం కితాబు

**విజయవాడ :**



ఎన్నో సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి చేకూరేలా చూస్తుంది ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కార్.. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవలపై ప్రశంసలు కురిపించింది కేంద్ర ప్రభుత్వం.. ఏపీలోని గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) నిరంతర సేవలతో అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయంటూ పార్లమెంట్‌కు వెల్లడించింది కేంద్రం రాష్ట్రంలో నూటికి నూరు శాతం గ్రామీణ పీహెచ్‌సీలు 24 గంటలూ పని చేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు వందకు వంద శాతం 24 గంటలపాటు పనిచేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని కేంద్రం వెల్లడించింది.. ఆ తరువాత స్థానంలో సిక్కిం ఉండగా.. దేశవ్యాప్తంగా మరే రాష్ట్రంలోనూ ఏపీ తరహాలో నూటికి నూరు శాతం పీహెచ్‌సీలు నిరంతరం సేవలందించడం లేదని పేర్కొంది.రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా అవన్నీ నూటికి నూరు శాతం 24 గంటలు పని చేస్తున్నాయని తెలిపింది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ. ఇక, సిక్కింలో 24 పీహెచ్‌సీలుండగా అవి కూడా 24 గంటల పాటు సేవలందిస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 24,935 పీహెచ్‌సీలుండగా 11,250 పీహెచ్‌సీలు మాత్రమే అంటే 45.1 శాతం 24 గంటలు పని చేస్తున్నాయని పేర్కొంది. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు, సేవలను మెరుగుపరచేందుకు ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్‌ను నిర్దేశించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. ఇందులో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, డయాగ్నస్టిక్స్, పరికరాలు, మందులు తదితరాలకు సంబంధించిన నిబంధనలున్నాయి. అందుకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.. ఏపీలో గత మూడున్నరేళ్లలో ప్రజారోగ్య రంగంలో పెను మార్పులు చోటు చేసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. ఇక, దేశంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తరువాత ఏపీలోనే అత్యధికంగా సబ్ హెల్త్ సెంటర్లున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 20,781 సబ్ హెల్త్ సెంటర్లు ఉంటే.. రాజస్థాన్‌లో 13,589 సబ్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి.. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో గత మూడున్నరేళ్లలో కొత్తగా 304 పీహెచ్‌సీలు ఏర్పాటు చేశారు.. మరో 179 కేంద్రాల పనులు ప్రారంభించారు.

# బీసిలకు అండగా సర్కార్

**అదిలాబాద్ :**

బీసీల అభ్యున్నతే పరమావధిగా బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆరు వేల రెండు వందల కోట్ల రూపాయలను కేటాయించిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బీసీల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోఎస్ సంఘ భవనంలో బీసీ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగురామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే జోగురామన్న శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ... ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో బీసీల సంక్షేమం కోసం ఆరు వేల రెండు వందల కోట్ల రూపాయలను ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయలను మాత్రమే కేటాయించడం వారి చిత్తశుద్ధికి అద్దం పడుతోందని జోగు రామన్న అన్నారు. యాభై శాతం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు కేంద్రం బడ్జెట్ లో తక్కువ నిధులు కేటాయించిందని అన్నారు. నూతనంగా ఎన్నికైన బీసీ సంఘ సభ్యులు.. బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సూచించారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచేలా ఐక్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సాయి వైకుంట ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఆదిలాబాద్ మున్సిపల్ పట్టణంలోని వార్డు నంబర్ 4లోని అనుక్త గ్రామంలో ఏర్పాటు చేసిన కాలనీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనూ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి సందడిగా గడిపారు. వ్యవసాయ రంగానికి గత ఏడాది రూ. 24,254 కోట్లు కేటాయించారు. ఈసారి వ్యవసాయానికి రూ. 26,831 కోట్లు ఇచ్చారు. ఆసరా ఫించన్ల కోసం రూ. 12,000 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఆసరా పెన్షన్లకు రూ. 11,728 కోట్లు కేటాయించారు. , ఎస్టీ ప్రత్యేక నిధి కోసం ఈ ఏడాది రూ.15, 233 కోట్లు కేటాయింగా.. గత ఏడాది ఈ మొత్తం రూ. 12,565 కోట్లు మాత్రమే , బీసీ సంక్షేమం కోసం రూ. 6, 229 కోట్లు కేటాయించారు. గత ఏడాది ఈ మొత్తం రూ. 5,698 కోట్లు. విద్య కోసం రూ.19, 093 కోట్లు. వైద్యం కోసం రూ.12,161 కోట్లు కేటాయించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.12వేల కోట్లు, నీటి పారుదల రంగానికి రూ.26,885 కోట్లు కేటాయించారు. రుణమాఫీకి కూడా రూ ఆరు వేల కోట్ల వరకూ కేటాయించారు. ఈ ఏడాది ఆదాయ అంచనాలను ప్రభుత్వం ఎక్కువగా వేసుకుంది. కేంద్ర నుంచి రాష్ట్రానికి వచ్చే పన్నులు కాకుండా రూ.41 వేల కోట్లకుపైగా వస్తాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి 18 వేల కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా 39, 500 కోట్లు వస్తాయన్నారు.దాదాపుగా ఇరవై వేల కోట్లు మద్యం అమ్మకాల ద్వారా వస్తాయని చెప్పారు. అయితే ఈ ఆదాయ అంచనాలే ఎక్కువ అయితే.. ఆదాయానికి ఖర్చునకు పొంతన లేకుండా బడ్జెట్ లెక్కలు ఉన్నాయన్న విమర్శలు ఇతర నేతల దగ్గరనుంచి వస్తున్నాయి.

# ముమ్మాటికి మాది కుటుంబ పాలనే: కేటీఆర్

**హనుమకొండ :**



ముమ్మాటికి మాది కుటుంబ పాలనే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చి చెప్పారు. కేసీఆర్‌ను విమర్శించేందుకు విపక్షాలకు కారణం దొరకట్లేదు. ఏ తప్పు దొరక్క కుటుంబ పాలన అని కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి చెబుతున్నా.. మాది కుటుంబ పాలనే అని బరాబర్ చెబుతున్నా అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ. 125 కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు చేసిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.4 కోట్ల మంది తెలంగాణ ప్రజలంతా మా కుటుంబ సభ్యులే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబంలో కేసీఆర్ భాగస్వామినే. రైతులందరికీ పెద్దన్నలాగా కేసీఆర్ అండగా ఉన్నాడు. ఆసరా పెన్షన్లతో వృద్ధులను కడుపులో పెట్టుకున్నాడు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ మేనమామ అయిండు. కేసీఆర్ కిట్ పథకం అమలుతో సర్కార్ దవాఖానాలో ప్రసవాల కోసం క్యూ కడుతున్నారు. గురుకులాల్లో 6 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా ఆ విద్యార్థులను తయారు చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.

### జనహితమే మా అభిమతం..

కులం పంచాయతీ లేదు. మతం పిచ్చి లేదు. జనహితమే మా అభిమతం అని కేటీఆర్ స్పష్టం చేశారు. అభివృద్ధే మా కులం, సంక్షేమమే మా మతం అని తేల్చిచెప్పారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు బాగుపడుతున్నాయి. పట్టణాలు బాగు పడుతున్నాయి. దేశంలో అత్యుత్తమ గ్రామాలు, మున్సిపాలిటీలు ఎక్కడ ఉన్నాయంటే తెలంగాణలో ఉన్నాయని కేంద్రమే చెబుతోంది. కేంద్రం మాటలు చెప్పడం తప్పా ఒక్క పైసా పని చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీకి 10 ఛాన్స్‌లు ఇచ్చారు.. కొంత మంది రాజకీయ నిరుద్యోగులు పనికిమాలిన పాయదత్రాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ కి ఒక్క చాన్స్ ఇవ్వండి అని పార్టీ పీసీసీ అధ్యక్షుడు అడుక్కుంటున్నాడు. మీ దిక్కుమాలిన పార్టీకి 10 ఛాన్సులు ఇచ్చారు. మీ హయాంలో కరెంట్, నీళ్లు లేక తెలంగాణ రైతన్న ఆత్మహత్యల పాలైండు. మీ మాటలకు పడిపోయేవారు ఎవరూ లేరు. తెలంగాణలో అమాయకులు ఎవరూ లేరు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### ఆ ఆలోచన ఎందుకు రాలేదు..?

50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఏం చేశారు అని కేటీఆర్ నిలదీశారు. 24 గంటల కరెంట్ రైతులకు ఇవ్వాలన్న సోయి మీకు వచ్చిందా? ఒక్కో ఎకరానికి రూ. 5 వేల చొప్పున రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు రాలేదు? రైతులకు బీమా కల్పించాలనే ఆలోచన ఎందుకు రాలేదు? కరెంట్, సాగు, తాగు నీరు ఇవ్వరు.. ఇప్పుడేమో ఎగతాళిగా మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అడుక్కుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

### పంజాబ్, హర్యానాతో తెలంగాణ రైతులు పోటీ..

ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో పంజాబ్, హర్యానాతో తెలంగాణ రైతుల పోటీ పడుతున్నారు. చెరువులను బాగు చేసి, సాగునీరు అందించి, ఉచిత కరెంట్ ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. గతంలో తాగునీరు ఇవ్వకుండా మహిళలను ఇబ్బంది పెట్టారు. కానీ కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించి, నీటి గొడవలకు స్వస్తి పలికారు అని కేటీఆర్ తెలిపారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# “నిన్న కాదు నేడు కాదు ఎప్పుడూ నే రాజా”

## మునుపెన్నడూ జరగనంత గ్రాండ్ గా ఇళయరాజా కాన్సర్ట్

మాస్ట్రో ఇళయరాజా లైవ్ షోకి హైదరాబాద్ మరోసారి వేదికయింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఇళయరాజా లైవ్ షో సంగీత ప్రియులని, అభిమానులని అలరించింది. మెగాస్టార్ చిరంజీవి వాయిస్ ఓవర్ తో లైవ్ షో ప్రారంభమయి ఇళయరాజా పాడిన జననీ జననీ పాటతో మొదలైన మ్యూజికల్ ట్రీట్ ఆద్యంతం ఆకట్టుకుంది. కార్తిక్ పాడిన ఓం శివోహం పాట ప్రేక్షకుల్లో గొప్ప ఉత్సాహాన్ని తెచ్చింది.

ఎన్నో రాత్రులొస్తాయిగానీ, మాటే మంత్రము, కలయా నిజమా పాటలని ఇళయరాజా స్వయంగా ఆలపించి అలరించారు. ఈ లైవ్ షో లో దాదాపు 35 పాటలు అలపించగా రీటెకులు, అపశ్రుతులు దొర్లకుండా లైవ్ షో ని కండక్ట్ చేయడంలో ఇళయరాజా మరోసారి తన మార్క్ చూపించారు.

మనో, ఎస్పీ చరణ్ .. బాలు లేని లోటుని తీర్చడానికి తమ శక్తి మేరకు ప్రయత్నించగా కార్తిక్, శరత్ లు ఆకట్టుకున్నారు. చివర్లో సింగారాల పైరుల్లోన పాట స్టేడియంని సందడిగా చేసింది. ఫిమేల్ సింగర్స్ విభావరి, శ్వేత, సునీత, శీరిష, అనిత తమ గాన మాధుర్యం తో అలరించారు.

ఇళయరాజా స్వరపరిచిన పాటలు ఏళ్ళు గడుస్తున్నా అందులో వున్న ఫ్రెష్ నెస్ కొంచం కూడా తగ్గదు, ఎన్ని సార్లు విన్నా అదే ఎమోషన్ కనెక్ట్ అవుతుంది అందుకేనేమో ఆయన్ని మ్యూజికల్ గాడ్ అంటారు. ఒక పాట తయారీ వెనుక ఎలాంటి శ్రమ వుంటుంది ? ఎంత సృజన అవసరమో .. ఓ ప్రియ ప్రియ.. పాటలో వచ్చే ఒక ఇంటర్ల్యూడ్ తో ప్రేక్షకులకు వివరించారు రాజా. ఎన్ని లేయర్లలో వర్క్ జరుగుతుందో చెప్పి.. ఇలా సంగీతాన్ని ప్రేక్షకులకు చెప్పే మ్యూజిక్ డైరెక్టర్ ఎవరైనా వున్నారా ? అని ప్రశ్నించి.. ‘ఎవరు లేరు..నేను మాత్రమే ఇలా చెప్తాను’ అని ఇచ్చిన సమాధానంతో మైదానంలో చప్పట్లు మారుమ్రోగాయి.

ఎనభై ఏళ్ల వయసులో మూడున్నర గంటల పాటలు ఒక్క సెకన్ కూడా కూర్చోకుండా ఆయన లైవ్ కండక్ట్ చేయడం అందరినీ సర్ప్రైజ్ చేసింది.

ఇళయరాజా లైవ్ షో అంటే బాలు వుంటే ఆ సందడే వేరు. పాటలతో పాటు మంచి సరదా కబుర్లు వుంటాయి. ఇళయరాజాని.. ఏరా అని పిలిచే చనువు బాలుకుంది. రాజా మ్యూజిక్ లోని గ్రేట్ నెస్ బాలు చెబుతుంటే ఆ మ్యాజిక్ వేరుగా వుంటుంది. అదొక్కటే ఈ షో లో మిస్ అయ్యింది. పాటల వెనుక వున్న కబుర్లు చెప్పే మనిషే కనిపించలేదు.

దేవిశ్రీ ప్రసాద్ ఇళయరాజకి భక్తుడు. రాజా లైవ్ షో ఎక్కడున్న రెక్కలు కట్టుకొని వాలిపోవడం దేవిశ్రీకి అలవాటు. గచ్చిబౌలి స్టేడియంలో కూడా దేవిశ్రీ సందడి కనిపించిది. ప్రతి పాటకు పరవశించిపోయారు. జగడ జగడ జగడం పాటకైతే కూర్చున్న చోటే డ్యాన్స్ చేశారు. స్టేజ్ మీదకి వెళ్లి “మీ పాటకి మా మనసులు, ప్రాణాలు, జీవితాలే ఊగుతున్నాయి. రాజా గారికి దేశం భాషతో పని లేదు. ఆయన మన మనసులో నిండిపోయారు” అని తన ఆనందం పంచుకున్నారు. టాలీవుడ్ నుంచి నాని, హరీష్ శంకర్, బుచ్చిబాబు, మంచు



లక్ష్మీ, ఇషా రెబ్బా, వర్ష బొల్లమ్మ..చాలా మంది ప్రముఖులు హాజరయ్యారు.

లైవ్ షో లో కళాతపస్వి కె విశ్వనాథ్ కి అంజలి ఘటించారు ఇళయరాజా. సాగరసంగమం, స్వాతి ముత్యంలోని వేదం అణువణువున తకిట తధిమి తందాన, మౌనమేలనోయి, లాలి లాలి పాటలతో కె విశ్వనాథ్ కి నివాళి అర్పించారు.

తాజా లైవ్ షోలో ఎక్కువగా యువత కనిపించింది. స్టేడియంలోని అన్ని సెక్షన్ లు నిండిపోయాయి. షో పూర్తయ్యే వరకూ ఫుల్ క్రౌడ్ వుంది. తాము అభిమానించే పాటల స్వరకర్తని ప్రత్యేక్షంగా చూసి ? ఇలాంటి పాటల రాత్రులు మళ్ళీ మళ్ళీ రావాలని మేస్ట్రో మ్యూజికల్ నైట్ ని ఎంజాయ్ చేశారు వీక్షకులు.













Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950